


www.jananinadam.com

Follow:

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

**జిల్లా వారిగా విలేకర్లు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న **జననినాదం** తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్సిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను.

**సంప్రదించాల్సి నెంబర్**

9550100197,9490111460

సంపుటి: 1 సంచిక: 284 | Simultaneously published from , Asifabad, Karimnagar, Adilabad , & Hyderabad. | గురువారం 22-05- 2025 | ➤ పేజీలు : 8 | ➤ వెల : రూ.2.00




## 175 బిలియన్ల డాలర్లతో..
## క్షిపణి రక్షణ వ్యవస్థ
# 'గోల్డెన్ డోమ్'
## ప్రకటించిన ట్రంప్

న్యూయార్క్ : భవిష్యత్తు రాబోయే యుద్ధాలను దృష్టిలో పెట్టుకుని అమెరికా సమాయత్తమవుతున్నది. ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇవాళ భారీ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్‌లోని ఐరన్ డోమ్ తరహా లో.. అమెరికాకు గోల్డెన్ డ్రోమ్ ను రూపొందించనున్నట్లు చెప్పారు. సుమారు 175 బిలియన్ల డాలర్ల ఖర్చుతో ఆ డోమ్‌ను నిర్మించనున్నారు. బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణు లు, ఇతర వైమానిక దాడుల నుంచి అమెరికాను కాపాడుకు నేందుకు గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందించనున్న ట్లు ట్రంప్ చెప్పారు. గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థ తన పదవీ కాలం ముగిసేలోగా వినియోగంలోకి వస్తుందన్నారు.రాబోయే రోజుల్లో అమెరికాకు వైమానిక దాడుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, ముఖ్యంగా బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఓ కొత్త ప్లాన్‌ను ప్రకటిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గోల్డెన్ డోమ్ కోసం ఈ సారి బడ్జెట్‌లో 25 బిలియన్ల డాలర్లు కేటాయించినట్లు చెప్పారు.

2వ పేజీలో...



## ప్రధానికి అండగా ఉండాల్సిన సమయంలో
## కిషన్ రెడ్డి దుప్పటి కప్పుకుని
# పడుకున్నారు

2వ పేజీలో...

- పాకిస్థాన్ కు బుద్ధి చెప్పడంలో కేంద్రం విఫలమయిందన్న రేవంత్
- అమెరికా ఒత్తిడికి మోదీ ప్రభుత్వం తలొగ్గిందని విమర్శ
- ఒక గొప్ప అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్,: దాయాది దేశం పాకిస్థాన్‌కు తగిన రీతిలో గుణపాఠం చెప్పడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అమెరికా వంటి దేశాల ఒత్తిళ్లకు తలొగ్గి, పాకిస్థాన్ విషయంలో కీలక అవకాశాలను కేంద్రం చేజార్చుకుందని ఆయన ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.



## ఆర్మీ స్కూల్ బస్సుపై
# ఆత్మాహుతి దాడి..

2వ పేజీలో...

ఢిల్లీ,:భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్న దాయాది దేశం పాకిస్థాన్ లో తాజాగా ఆత్మాహుతి దాడి జరిగింది. ఓ పాఠ శాల బస్సును సూసైడ్ బాంబ్ కారు ఢీ కొట్టింది. ఈ ఘటన లో నలుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీ పబ్లిక్ స్కూల్ కు చెందిన బస్సు ఈ ఉదయం పిల్లల్ని తీసుకొని వెళ్తోంది. ఆ సమయంలో దానిని లక్ష్యంగా చేసుకొని ఆత్మాహుతి దాడి జరిగింది.

న్యూఢిల్లీ,మే21 : దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమో దైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడిం చారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుం డటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జన వరి నుంచి మహారాష్ట్ర లో ఏకంగా వందకు పైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్ట్‌లు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది.



2వ పేజీలో...

## దేశంలో మళ్లీ కరోనా
# విజృంభణ

ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం



## రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల
# నివాళి

2వ పేజీలో...

### తండ్రితో జ్ఞాపకాలను నెమరు వేసుకున్న రాహుల్

న్యూఢిల్లీ,మే21 : భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేడు 34వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ తనయుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేలు ఢిల్లీలోని వీర్ భూమి రాజీవ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు.



2వ పేజీలో...

28 మంది మావోయిస్టులు హతం..!
మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతి..?

# దండకారణ్యంలో ఎదురు కాల్పులు..



## కమీషన్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే
# విచారణ
## కమిషన్లు, నోటీసుల డ్రామాలు

- పర్సంటైల్ పాలనగా ప్రజా పాలన
- ఎస్ఎల్‌బీసీ కూలితే బాధ్యులపై చర్యలేవి
- ఎన్ని డ్రామాలు చేసిన చివరకు న్యాయం, ధర్మమే గెలుస్తుంది
- నల్లగొండలో మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నల్లగొండ ప్రతినిధి, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం తమ కమీషన్ల గురించి ప్రజల దృష్టిని మళ్లించ డానికే విచారణ కమిషన్లు ఏర్పాటు చేయడం, వాటి ద్వారా నోటీసులు ఇవ్వడం లాంటి డ్రామాలు చేస్తుం దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజా పాలన కాస్తా కమీషన్ల పాలనగా మారింద ని, ఇదంతా వారి మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు చెబుతున్నదేనన్నారు. కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కుప్పకూలితే ఇప్పటికీ శవాలను తీయలేక పోయారని విమర్శించారు. కనీసం దానికి బాధ్యులు ఎవరో కూడా తేల్చలేక పోయారన్నారు. ఇవ్వన్నీ కప్పి పుచ్చుకోవడానికి వారు తమకు ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని డ్రామాలు ఆడినా అవన్నీ దూది పింజల్లా తెలిపోవడం ఖాయమన్నా రు. బుధవారం నల్లగొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జిల్లా శంకర్ వివాహానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

2వ పేజీలో...

జైపూర్, : జైపూర్ మండలం రామారావు పేట గ్రామంలో ఓపెన్ కాస్ట్ సమీపంలో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు మట్టిని అమ్ముకుంటూ లక్షల రూపా యలు సొమ్ము చేసుకుంటున్నారు మంచిర్యాల జిల్లా లోని పలు గ్రామాలకు తరలించడమే కాకుండా జైపూర్ మండల పరిధిలో వెంచర్లకు అధిక ధరలకు అమ్ముతున్నా రు ఎవరికి అనిపించకుండా ఉన్న ప్రాంతం అవడంతో మట్టి దళారులు రెచ్చిపోతున్నారు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ భారీ లోతుతో రెండు నుండి మూడు మీటర్ల వరకు జెసిబి సహాయంతో మట్టిని తవ్వుతూ లారీలలో తరలిస్తున్నారు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు వెంచర్ల యజమానులతో బేరం కుదుర్చు కొని ఒక ట్రిప్పుకు 3000 రూపాయల నుండి 5 వేల రూపాయల వరకు అమ్ముచున్నారు గతంలో కూడా వం దల ఎకరాలలో తవ్వకాలు చేపట్టారు అదేవిధంగా జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి మట్టి అనగానే రామారావు పేట గ్రామం గుర్తు వచ్చేలా వ్యవహ రిస్తున్నారు గ్రామాలలో ఉండే చెరువులు మరియు కుంటలు లాగా తవుచున్నారు ప్రభుత్వ అధికారులు మరియు మైనింగ్ అధికారులు ఇచ్చే క్యూ మీటర్లు కొంత అయితే తవ్వకాలు వేల క్యూ మీటర్లు ఉంటున్నాయి ఈ విధంగా మట్టి దందా జరుగుతున్న ప్రభుత్వ అధికారులు చూసి చూడనట్టుగా ఉండడం వలన ప్రజలలో పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి ఇప్పటికైనా దానిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆరోపిస్తున్నారు



- జైపూర్ మండలంలో ఇసుక దొంగల భరీ తెగింపు
- పర్యావరణ, వాల్టా అనుమతులు నిల్
- జేబులు నింపుకుంటున్న నాయకులు, బ్రోకర్లు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

## రామారావు పేట ఓపెన్ కాస్ట్ సమీపంలో..
# విచ్చలవిడిగా
# మట్టి తవ్వకాలు

# 175 బిలియన్ల డాలర్లతో క్షిపణి రక్షణ వ్యవస్థ



మునుముందు ఆ డోమ్ కోసం భారీగా ఖర్చు చేసే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అత్యాధునిక ఆయుధాలు శత్రువుల వద్ద ఉన్నాయని, దానికి తగినట్లు రక్షణ వ్యవస్థను తయారు చేసుకోవాలన్నారు. గోల్డెన్ డోమ్ ప్రాజెక్టు నిర్మాణ పనులను స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లెన్‌కు అప్పగించారు. స్పేస్ ఫోర్స్‌లో ప్రస్తుతం ఆయన స్పేస్ ఆపరేషన్స్ వైస్ చీఫ్‌గా ఉన్నారు. ఏరియల్ దాడుల్ని అడ్డుకునేందుకు కావాల్సిన వ్యవస్థను రూపొందించాలని, దానికి కావాల్సిన ప్రణాళికలను తయారు చేయాలని ట్రంప్ ఇటీవల రక్షణ శాఖను ఆదేశించారు. దాని ప్రకారమే గోల్డెన్ డోమ్ కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. వైట్‌హౌజ్‌లోని ఓవల్ ఆఫీసులో ట్రంప్ మాట్లాడుతూ.. భూమి, ఆకాశం, నీటి యుద్ధాల్లో వాడే టెక్నాలజీ ఆయుధాలను ఎదుర్కొనే రీతిలో మిస్సైల్ రక్షణ వ్యవస్థ పనిచేయనున్నట్లు తెలిపారు. అంతరిక్ష ఆధారిత సెన్సార్లు, ఇంటర్‌సెప్టార్లను కూడా తయారు చేయనున్నారు. గోల్డెన్ డోమ్ రూపకల్పన కోసం కెనడాను కూడా భాగస్వామ్యం కావాలని కోరినట్లు ట్రంప్ వెల్లడించారు. డోమ్ ప్రాజెక్టులో తాము కూడా

**మొదటిపేజీ తరువాయి...**

ఆసక్తిగా ఉన్నట్లు ఇటీవల ఆ దేశ రక్షణ శాఖ మంత్రి బిల్ బ్లెయిర్ తెలిపారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అది కీలకమైందన్నారు. గోల్డెన్ డోమ్ పని తీరు గురించి వివరిస్తూ.. ఇతర ప్రపంచ దేశాల నుంచి ప్రయోగించిన క్షిపణులను కూడా ఆ వ్యవస్థ అడ్డుకోగలదని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌కు చెందిన ఐరన్ డోమ్‌ను ప్రేరణగా తీసుకుని దీన్ని డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. రాకెట్లు, మిస్సైళ్లను తిప్పికొట్టేందుకు ఇజ్రాయిల్ 2011 నుంచి ఐరన్ డోమ్‌ను వాడుతున్నది. అయితే గోల్డెన్ డోమ్‌ను అత్యంత భారీ సైజులో నిర్మించనున్నారు. వివిధ రకాల దాడుల్ని తిప్పికొట్టే రీతిలో దాన్ని తయారు చేయనున్నారు. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో ప్రయాణించే హైపర్‌సోనిక్ మిస్సైళ్లను కూడా అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆకాశంలోనే శత్రువు ఆయుధాలను చిత్తు చేయనున్నట్లు చెప్పారు. డోమ్ సక్సెస్ రేటు 100 శాతం ఉంటుందన్నారు. మిస్సైళ్లను లాంచ్ చేసే సమయంలోనైనా, లేదా అవి మార్గమధ్యంలో ఉన్న సమయంలోనైనా.. వాటిని అడ్డుకునే రీతిలో గోల్డెన్ డోమ్ పనిచేస్తుందని అమెరికా అధికారులు చెబుతున్నారు. చాలా రకాల వ్యవస్థలన్నీ.. ఒక సెంట్రలైజ్డ్ కమాండ్ కింద పనిచేస్తాయని రక్షణ శాఖ అధికారులు పేర్కొన్నారు. రాబోయే 20 ఏళ్లలో ఆ డోమ్ కోసం సుమారు 542 బిలియన్ల డాలర్లు ఖర్చు చేసే అవకాశాలు ఉన్నాయి. రష్యా, చైనా దేశాలు మిస్సైల్ టెక్నాలజీలో దూసుకెళున్నాయని, అయితే ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు ఆ టెక్నాలజీని ఢీకొట్టే రీతిలో లేవని, దాని కోసమే గోల్డెన్ డోమ్‌ను రూపొందిస్తున్నట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు.

# కమీషన్ల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ



ఈ సందర్భంగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నేతలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గత 17 నెలలుగా పాలన చేతగాక, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని దద్దమ్మ ప్రభుత్వమిది అన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రతీ పనిలో వసూలు చేస్తున్న కమీషన్ల మీద నేడు రాష్ట్రం మొత్తం గగ్గోలు పెడుతుందన్నారు. చిన్న చిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లు సెక్రటేరియట్‌కి వచ్చి 20%, 30% కమీషన్లు తీసుకుంటున్నారంటూ ధర్నాలు చేసింది నిజం కదా అని ఆయన ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ బాధ్యులపై చర్యలేవి?: చివరకు ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కమీషన్లు లేనిది, పైసలు లేనిది తమ ప్రభుత్వంలో పనులు కావడం లేదని బహిరంగంగానే చెబుతున్న విషయం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి నేటితో మూడు నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ నల్లగొండ రైతులు, ప్రజల తరుపున రేవంత్ రెడ్డిని అడుగుతున్నానని, సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో సమర్థవంతమైన సీఎం ఉండి ఉంటే మంగళగ్రామ్‌లో చిక్కుకుపోయిన మనుషులను సైతం అక్కడి నుంచి తెచ్చే వాళ్లు అని ఏద్దేవా చేశారు. కానీ

**మొదటిపేజీ తరువాయి...**

వారి కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోతే అందులో చుక్కుకుపోయిన వారి శవాలను సైతం తీయలేకపోయారని మండిపడ్డారు. కనీసం ఆ పనుల్లో ఏమి జరిగిందో చెప్పే పరిస్థితి లేదన్నారు.

కాళేశ్వరంను విఫల ప్రాజెక్ట్‌గా ప్రచారం చేసే కుట్రలు: సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఇప్పటి వరకు అందుకు కారణమైన సంస్థపై విచారణ లేదని, చర్యలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక వాట్టెం పంపుహౌస్ మునిగితే దానిపై చర్యలు లేవన్నారు. పెద్దవాగు ప్రాజెక్ట్ రెండుసార్లు కొట్టుకుపోతే దాని మీద చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను విఫల ప్రాజెక్ట్ గా ప్రచారం చేసే కుట్రలు చేస్తున్నాయని, కానీ ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసన్నారు. దేశంలోని చట్టాల మీద, న్యాయ వ్యవస్థ మీద తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. కమిటీల పేరిట, కమిషన్ల పేరిట కాలయాపన చేస్తూ ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని మండిపడ్డారు.

త్రీడీ మంత్రం ఎక్కువ రోజులు నడవదు: 420 హామీల అమలును పట్టించుకోవడం లేదని, ఇచ్చిన ప్రతీ హామీ అమలు కోసం ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే సమస్యే లేదని ఆయన హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్ ఎప్పుడిస్తారని లబ్ధిదారులు అడుగుతున్నారని, తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ఆడబిడ్డలు, వాళ్ల తల్లిదండ్రులు అడుగుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదన్నారు. వారు ఎన్ని నోటీసులు ఇచ్చినా, డ్రామాలు చేసినా ముమ్మాటికీ న్యాయం, ధర్మం గెలుస్తాయన్నారు. తెలంగాణకు మేలు చేసిన వారిని ఆ దేవుడు కాపాడుతాడన్నారు. 17 నెలల నుంచి ఎన్ని చిల్లర వేషాలు వేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు. వారు త్రీడి మంత్రంగా భావిస్తున్న డిసెప్షన్, డిస్ట్రాక్షన్, డిస్ట్రక్షన్ అనే ఆలోచన ఎక్కువ రోజులు నడవదన్నారు. ముమ్మాటికీ తెలంగాణ ప్రజలు తిరగబడి స్కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ప్రధానికి అండగా ఉండాల్సిన సమయంలో

# కిషన్ రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారు

**మొదటిపేజీ తరువాయి...**


పాకిస్థాన్‌తో వ్యవహరించే తీరులో మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో అమెరికాతో సహా పలు ప్రపంచ దేశాల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదురైనా, వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యుద్ధాన్ని కొనసాగించి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం విషయంలో తాము ఎలాంటి రాజకీయాలు చేయబోమని స్పష్టం చేశారు. ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి ఎంతో వన్నె తెచ్చారని, భారతదేశాన్ని ఒక ఆర్థిక శక్తిగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో గట్టిగా వ్యవహరించేందుకు వచ్చిన సువర్ణావకాశాన్ని కేంద్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోయిందని ఆయన మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం దేశంలో తొలిసారిగా తామే తిరంగా ర్యాలీ నిర్వహించామని సీఎం గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో, ప్రధానమంత్రికి మద్దతుగా నిలవాల్సిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆనాడు దుప్పటి కప్పుకుని పడుకున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

ఆపరేషన్ సిందూర్ విషయంలో పార్టీల ప్రమేయం లేకుండా, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశ ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# మూడు రైల్వే స్టేషన్ లు ప్రారంభానికి శ్రీకారం...

వరంగల్, మే 21, : తెలంగాణ రాష్ట్రంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లోని బేగంపేట, వరంగల్, కరీంనగర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 22న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ స్టేషన్ల చిత్రాలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) నిధుల ద్వారా చేపట్టిన పనులతో ఈ స్టేషన్లు విమానాశ్రయాల తరహాలో అత్యాధునిక హంగులతో ప్రకాశిస్తున్నా యి. స్టేషన్ల వెలుపలి, లోపలి భాగాలలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారుకరీంనగర్ రైల్వే స్టేషన్‌లో దాదాపు రూ. 26.64 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆధునీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ స్టేషన్‌ను పూర్తిగా మెరుగుపరిచారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారమ్ నుండి మరొక ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేందుకు మెట్లు ఎక్కే శ్రమను తగ్గించేందుకు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. విశాలమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన ప్లాట్‌ఫారమ్‌లు, ఆధునిక మరుగుదొడ్లు, మెరుగైన లైటింగ్, టికెట్ కౌంటర్లు, లాకర్ గదులు, తాగునీటి సౌకర్యం, ఏటీఎంలు, డిజిటల్ డిస్‌ప్లేలు, సీసీటీవీ కెమెరాలు వంటి అనేక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ రైల్వే స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 102 రైల్వే స్టేషన్లను ఒకేసారి ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణలో ఎంపికైన మూడు స్టేషన్లలో కరీంనగర్ ఉండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కరీంనగర్ స్టేషన్ అద్భుతంగా మారిందని.. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా ఆధునీకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తీగలగుట్ట ఆర్వోబీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ కంటే అదనంగా మరో రూ.2 కోట్లు వెచ్చించి రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే.. ఉప్పల్ ఆర్వోబీ పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్ మరియు అధికారులను మందలించామని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోంది. ఈ పథకం కింద ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, స్టేషన్లను ఆధునీకరించడం వంటి పనులు చేపడుతున్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన వేచి ఉండే ప్రాంతాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఉచిత వై-ఫై సదుపాయం కల్పించడం. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయడం. స్టేషన్లలో ప్రయాణికుల సమాచార వ్యవస్థను మెరుగుపరచడం, పర్యావరణ అనుకూలమైన పద్ధతులను అవలంబించడం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటివి వీటిలో భాగంగా ఉంటాయి. తెలంగాణలో అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన రైల్వే స్టేషన్లలో ముఖ్యంగా.. సికింద్రాబాద్, బేగంపేట్, కాచిగూడ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రామగుండం, నల్గొండ, మిర్యాలగూడ, జనగాం, భువనగిరి, మధిర, యాదాద్రి వంటి స్టేషన్లు ఉన్నాయి. అయితే వీటిలో వరంగల్, కరీంనగర్, బేగంపేట్ రైల్వే స్టేషన్ల పనులు పూర్తయ్యాయి. అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 1309 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడానికి ఎంపిక చేశారు.

# ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహం..



బెంగళూరు: రైల్వే వంతెన సమీపంలో ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడం తో దర్యాప్తు చేస్తున్నారు. యువతిని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి కదులతున్న రైలు నుంచి బయటకు విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం హోసూర్ ప్రధాన రహదారిలోని పాత చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో, రైలు పట్టాల దగ్గర నీలం రంగులో ఉన్న ట్రావెల్ సూట్‌కేస్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, పోలీసులు

## రైలు నుంచి విసిరేసినట్లు అనుమానం

సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రావెల్ బ్యాగ్‌లోని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. హతురాలి వయసు 18 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. ఆమెను ఎక్కడో హత్య చేసి సూట్‌కేసులో మృతదేహాన్ని కుక్కి కదులుతున్న రైలు నుంచి విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. తమ ప్రాంతం పరిధిలో మృతదేహం లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు వివరించారు.

# దేశంలో మళ్లీ కరోనా విజృంభణ

**మొదటిపేజీ తరువాయి...**



జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది. సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటి వారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగు తున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులుచెబుతున్నారు. జేఎన్.1ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

# దండకారణ్యంలో ఎదురు కాల్పులు..

**మొదటిపేజీ తరువాయి...**



కొత్తగూడెం ప్రగతి మైదాన్, 21 మే : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో రక్తపుటేర్లు పారాయి..! భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య భీకర పోరు జరుగుతోంది. ఈ ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 28 మంది మావోయిస్టులు నేలకొరిగినట్లుగా సమాచారం..! వివరాల్లోకి వెళితే.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ – నారాయణపూర్ జిల్లాల మధ్య గల మాడ్ డివిజన్ పరిధిలోని అబూజ్మాడ్ అడవుల్లో భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం వారికి మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య భీకర పోరు కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఈ ఎదురు కాల్పుల్లో 28 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా ప్రాథమిక సమాచారం అందుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లుగా పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఎదురు కాల్పులు జరుగుతున్నట్లుగా నారాయ ణపూర్ జిల్లా ఎస్పీ ప్రభాత్ కుమార్ స్పష్టం చేశారు. స్వల్ప విరామం తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీస్ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. మావోయిస్టులు గత మూడు నెలలుగా శాంతి చర్చలకు కాల్పుల విరమణ కావాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి లేఖలు రాస్తున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పై సర్వత్ర చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఎదురు కాల్పుల ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది.

# రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

**మొదటిపేజీ తరువాయి...**

వీరితోపాటు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ నేతలు కూడా స్మారక ప్రదేశంలో రాజీవ్‌కి ఘనంగా నివాళు లర్పించారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను భారతదేశ ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలని ప్రస్తావిస్తూ ఖర్గే ఎక్స్ పోస్టు చేశారు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోనే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహిం చారు. కంప్యూటరీకరణను అమలు చేశారు. సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. రాజీవ్‌గాంధీ లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన నిర్ణయాలు కీలకపాత్ర పోషించాయి అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఙాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాహుల్ తన తండ్రి రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఫొటోకు జతగా 'నాన్న మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం. నేను వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తాను' అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఙాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయసులోనే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 1984 నుంచి 1989 డిసెంబర్ 2 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. తమిళ ఈలం ఆత్మాహుతి దాడిలో ఆయన దుర్మరణం చెందారు.

# మంగళతండాలో పిడుగుపాటుకు 36 మేకలు మృతి

కోదాడ రూరల్, మే 21 : పిడుగుపాటుకు 36 మేకలు మృతిచెందాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి నల్లబండగూడెం శివారు మంగళతండా రోడ్డులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబండగూడెం గ్రామానికి చెందిన బడుగు లక్ష్మయ్యకు చెందిన మేకలు మంగళతండా రోడ్డులోని రైస్ మిల్ ఎదురుగా ఉన్న పొలంలో మేత మేస్తున్నాయి. మబ్బులు కమ్మి వాన చిలుకలు పడుతుండడంతో మేకల మంద ఒక్కసారిగా సమీపంలోని చెట్టు కిందకు చేరాయి. అదే సమయంలో పిడుగు పడడంతో 36 మేకలు మృతిచెందాయి. మేకలకు దూరంగా ఉండడంతో కాపరి ప్రాణాలు దక్కాయి. సమాచారం అందుకున్న పశు వైద్యాధికారి, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామ చేశారు. మేకలు అమ్మి కూతురి వివాహం చేయాలనుకున్న లక్ష్మయ్యకు మేకల మృతి ఆవేదన భరితమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు, స్థానికులు కోరారు.

# ఆర్మీ స్కూల్ బస్సుపై ఆత్మాహుతి దాడి..

**మొదటిపేజీ తరువాయి...**

సూసైడ్ బాంబ్‌తో వచ్చిన కారు బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటన బలోచిస్థాన్‌లోని కుజ్‌దార్ ప్రావిన్స్‌లో చోటు చేసుకుంది. ఈ దాడి ఘటనలో నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 38 మంది గాయపడినట్లు కుజ్‌దార్ జిల్లా సీనియర్ అధికారి యాసిర్ ఇక్బార్ దస్తి తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ పిల్లల్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఈ దాడిని పాకిస్థాన్ ఇంటీరియర్ మినిస్టర్ మొహసీన్ నక్వీ తీవ్రంగా ఖండించారు. ఇక ఇప్పటివరకు ఏ గ్రూపు ఈ దాడికి బాధ్యత వహించలేదు

## గ్రామ పరిపాలన అధికారుల
# పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల్ ప్రతినిధి21:** జిల్లాలో ఈనెల 25వ తేదీన జరగనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి జిల్లా విద్యా, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, సమాచార శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీ, మండల తహసిల్దార్ రఫతుల్లా లతో కలిసి గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9.30 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటలకు గేటు మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు అవసరమైన సిబ్బందిని నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు అనుమతించడం జరగదని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రశ్నపత్రాల భద్రత కొరకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల ప్రకారం తహసిల్దార్ తో పాటు భద్రత సిబ్బందితో ప్రశ్నాపత్రాలను తరలించడం జరుగుతుందని, పరీక్ష ముగిసిన తర్వాత పూర్తి భద్రత మధ్య జవాబు పత్రాలను తరలించడం జరుగుతుందని తెలిపారు. అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, అగ్నిమాపక శాఖ అధికారి రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్.ఈ. రమ్యశ్రీ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**ఎస్సై ఎన్ మధుకర్**



**జననినాదం,సిర్పూర్(యు)కెరామెరి,21:** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ ఎన్ మధుకర్ అన్నారు. బుధవారం కెరామెరి మండల కేంద్రంలో ఎస్సై ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రాకపోకలు కొనసాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల కు సంబంధించిన నిజ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి ఆటో ఆటో నడుపుతూ లేండి కూడా గ్రామానికి చెందిన వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలు నడుపుతున్న సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. వా నిబంధనలు పాటించని వాహనదారుల పైన శాఖపరమైన చర్యలు తప్పమన్నారు.

## మెట్ పల్లి మినీ స్టేడియం లో జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ పోటీలు






మెట్ పల్లి మే 21: మెట్ పల్లి మినీ స్టేడియంలో బుధవారం రోజున జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఘనంగా చిన్నారి విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలను ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చిలుక చైతన్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడల వలన స్నేహభావం ఏర్పడుతుందని, క్రీడల వల్ల శారీరక మానసిక ఉల్లాసంతో పాటు విద్యార్థులు దృఢంగా ఉంటారని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ, తెలం గాణ పదకొండవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల కొరకు జగిత్యాల జిల్లా స్థాయి పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఇందులో సెలెక్ట్ అయినవారిని వచ్చే నెల జూన్ ఫస్ట్ తేదీన సికిం ద్రాబాద్ జింఖానా గ్రౌండ్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొం టారనిజిల్లా అథ్లెటిక్స్అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఇరవై ఐదు మంది క్రీడా విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రన్నింగ్ పోటీలు అరవై మీటర్స్, వంద మీటర్స్, రెండు వందల మీటర్స్, ఆరు వందల మీటర్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్ పోటీలను నిర్వహించడం జరిగిందాని తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చిన్నతనము నుండి చిన్నచిన్న ఆటలతో విద్యార్థులను క్రీడల వైపు దృష్టి మళ్లించే ఆలోచనతో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఏకతాటిగ సమ్మర్ కోచింగ్ క్యాంపు ల వలన విద్యార్థులు ఆటలవైపు రానిస్తున్నారని అన్నారు. మునుముందు జిల్లాను క్రీడారంగంలో రాష్ట్రంలోనే ముందు ఉండేలా కృషి చేయాలని, దానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సంఘం సభ్యులు మద్రిపల్లి కార్తీక్, శంకర్, క్రీడా ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి కరీంనగర్ వ్యాప్తంగా అకాల వర్షాలు

### రహదారులు జలమయం..ధాన్యం నీటిపాలు

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అకాల వర్షం అన్నదాతను ఆందోళన చేస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మెట్ పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఉరుములు మెరుపులతో బుధవారం తెల్లవారుజామున జోరువాన పడింది. మెట్ పల్లి లో రహదారులు జలమయమ య్యాయి... పవర్ సప్లై కి అంతరాయం ఏర్పడింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీళ్లు నిలిచి ధాన్యం తడిసింది. మెట్పల్లి మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోవడంతో పాటు కొంత కొట్టుకుపోయింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం తడిసిపోవడంతో రైతులు ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం చుట్టూ నీళ్లు నిలవడంతో వర్షపు నీటిని తొలగిస్తూ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో తూకం కాక, తూకం వేసిన ధాన్యం తరలింపులో జాప్యం చేయడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం నిజామాబాదులో 4.38, గంభీరావుపేట మండలం గజసింగవరం లో 3.95, కోనరావుపేట మండలం మర్దన్నపేటలో 3.68, వీర్నపల్లి మండలం కేంద్రంలో 3.6 సెంటీమీటర్లు వర్షం నమోదు అయింది.

# పదేళ్ల ప'రేషాన్' తీర్చిండూ..!




**ఇన్నేళ్ల సంది దరఖాస్తు చేసుకుంటూనే పోయినం**
**ఏనాడూ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవు**
**రేవంత్ సార్ వచ్చిండు.. రేషన్ కార్డు వచ్చింది..!!**
**కేవలం బియ్యం ఇచ్చే కార్డే కాదు.. పిల్లల భవిష్యత్తుకు భద్రత కార్డు**
**కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పల్లెల్లో ఆనందాల వెల్లువ**



**జననినాదం,తిర్యాణి 21:** నిజమే..! పదేళ్ల ప'రేషాన్'తీరింది. కాదు కాదు పోయింది. యేళ్ళ తరబడి నిరీక్షిస్తున్న కొత్త ఆహార భద్రత కార్డులు పల్లెల్లోకి రానే వచ్చాయి. కార్డు లేని ప్రతి గడపలోకి నూతన కార్డులు అడుగు పెట్టనే పెట్టాయి. కరోనా కాలంలో వెళ్ళదీసిన బాధలు.. పెద్ద చదువుల కోసం పిల్లలకు ఎదురవుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఇందిరమ్మ ఇళ్లుకైనా.. ప్రభుత్వ రుణానికైనా.. పోలగాండ్ల సదువులకైనా.. అన్నింటికి లంకె వేసి ఉన్నదే రేషన్ కార్డు. ఇప్పుడా రేషన్ కార్డులే తమ ఇంటి ముంగిటకు వేంచేస్తోంటే.. ప్రతి ఇంటా ఆనందాలు వెల్లి విరిస్తున్నాయి. ' రేవంత్ రెడ్డి సారు వచ్చిండు.. మాకు కొత్త రేషన్ కార్డు వచ్చింది' అని కొందరు మురిసి పోతోంటే.. పదేళ్ల సంది పడుతున్న బాధలు తొలగిపోయాయని మరికొందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 'ఇది బియ్యం ఇచ్చే కార్డు మాత్రమే కాదు. పిల్లల చదువులు, భవిష్యత్తుకు భద్రతనిచ్చే కార్డు' అనే ధీమా కూడా వెల్లువెత్తుతున్న తరుణంలో లబ్దిదారుల మది నుండి ఆవిష్కృతమవుతోన్న అభిప్రాయాల మాలిక ఇది...

### కార్డు వస్తుందని కలలోనూ అనుకోలేదు...!



"ఎన్నో యేండ్ల సంది రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నం. మండల ఆఫీసుల సార్లు సెప్పినప్పుడల్లా దరఖాస్తు చేసుకుంట పోయినం. అయినా కార్డు రాలే. ఇప్పుడు కూడా వస్తదో.. రాదో అని అనుకుని మళ్ళీ కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన. దరఖాస్తు చేసి నెల రోజులు దాటింది అంతే. అయితే రేషన్ కార్డు రానే వచ్చింది. కార్డు వస్తుందని కలలోనూ అనుకోలేదు" అంటూ తిర్యాణి మండలం పంగిడి మాదర గ్రామానికి చెందిన కుమ్రం గోపాల్ తన భావోద్వేగాన్ని వ్యక్త పరిచారు. కార్డు రావడం పట్ల సంతోషంగా ఉందని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆయన తెలిపారు.

**మెస్రం మధుకర్, రొంపల్లి (రాంచందర్ గూడా).**

### నిజంగా ప్రభుత్వాన్ని ప్రశంసించాలి..




'రేషన్ కార్డు అనేది పేద, సామాన్య ప్రజలకు ఎంతో వెసులుబాటు కలిగించేది. ఈ కార్డు లేకుంటే పేదోళ్ళకు చాలా కష్టం. అయినప్పటికీ ఇంతకు ముందు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ఎవరూ పట్టించుకోలేదు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పది సంవత్సరాలు రేషన్ కార్డు ఇచ్చిన నాథుడే లేడు. రాష్ట్రంలో కొత్తగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాగానే పేదవారికి కొత్త రేషన్ కార్డులు అందుతున్నాయి, ఇది చాలా మంచి పరిణామం. అందుకనే ఈ ప్రభుత్వాన్ని ప్రశంసించాల్సి ఉంది" అని తిర్యాణి మండల కేంద్రానికి చెందిన పడిగెల అమర్ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇన్ని సంవత్సరాల తరువాత కార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**పడిగెల అమర్, తిర్యాణి.**

### రేషన్ కార్డుల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రాయి సిడం వినోద్, మంగి**



గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డికి రూపాయి డాక్టర్ అని పేరుందని అంటారు. అందుకేనేమో పేదల ఆరోగ్య పరిస్థితులు తెలిసే ఆరోగ్య శ్రీ పథకం పెట్టిండు రాజశేఖర్ రెడ్డి. ఇప్పుడు ఈ ముఖ్యమంత్రి చెప్పింది చెప్పినట్టే రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి మంజూరు చేస్తున్నారు. అందుకే ఈ ముఖ్యమంత్రిని రేషన్ కార్డుల రేవంత్ రెడ్డి అని పిలిచే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు, వాటి ఫలాలు అందించిన వారే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. ఎందుకంటే నిత్యావసర సరుకులే కాదు.. పిల్లల ఉన్నత చదువులకు ఉపకరించే ఆదాయం సర్టిఫికెట్ కు ఆధారం ఈ రేషన్ కార్డే. అందుకే పిల్లల భవిష్యత్తుకు భద్రతనిచ్చే కార్డు' అని చెప్పక తప్పదు.

### పేదల ప్రభుత్వమని తేలిపోయింది..



'రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చాలా బాగా పని చేస్తున్నదని చెప్పడానికి అనేకం ఉన్నాయి. మహిళల కోసం ఉచిత బస్సు అందించారు. సన్నబియ్యం ఇస్తున్నారు. స్వయం ఉపాధికి కోసం రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బాటలు పడ్డాయి. వీటన్నింటినీ బట్టి ఇది ఖచ్చితంగా పేదల ప్రభుత్వమని తేలిపోతుంది" అని పట్కాల్ మండి గ్రామానికి చెందిన పున్నం హరీష్ కుమార్ అన్నారు. రానున్న రోజుల్లో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేసే అవకాశం ఉందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తేనే ఆ ప్రభుత్వం కలకాలం ప్రజల గుండెల్లో నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పున్నం హరీష్ కుమార్ తిర్యాణి**

## బండి సంజయ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపిన రంగసాయిపల్లి గ్రామస్తులు



రామడుగు21: రామడుగు మండలం రంగసాయి పల్లె గ్రామంలోని ఎస్సీ సంఘం భవనానికి ఎస్సీ కాలనీకి నేటి కొరత ఉండటం వలన మండల నాయకులు మునిగంటి శ్రీనివాస్ చారి రంగసాయి పల్లె గ్రామ భూత అధ్యక్షుడు మండల శేఖర్ వారితో ఎస్సీ కాలనీవాసులు నీటి సమస్యను విన్నవించుకున్నారు. వారు వెంటనే కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ కు తెలుపగా వారు వెంటనే స్పందించి రంగసాయి పల్లె ఎస్సీ కాలనీ కి బోరు మంజూరు చేసినారు. బండి సంజయ్ కుమార్ కు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి బోరు మంజూరుకు కృషిచేసిన మాజీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డికి మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ శక్తి కేంద్రం ఇన్చార్జి కట్ట రవీందర్ కు అంజి బాబుకు రంగ సాయి పల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. బోరు వేయడం వల్ల నీరు పుష్కలంగా రావడం తో కాలనీవాసులు బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగసాయి పల్లె బూత్ అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్ కార్యకర్తలు బాసవేణి శేఖర్ చిలుముల అంజయ్య చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# జీ హుజూర్!

భారతదేశ భవితవ్యాన్ని ప్రభావితం చేసే అంశాలపై కీలక నిర్ణయాలను అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తూ.. అంతర్గత అంశాల్లో పదేపదే జోక్యం చేసుకోవడం ఆందోళనకరం. దేశ సార్వభౌమాధికారాన్నే సవాల్ చేస్తున్న ఈ తీరుకు చెక్ పెట్టడానికి బదులు.. కనీసం నోరు మెదపడానికి కూడా ప్రధాని ఇష్టపడకపోవడం అగ్రరాజ్యానికి జీ హుజూర్ అనడమే!

పహల్గామ్ ఉగ్రదాడి తరువాత భారత్, పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని తొలుత ప్రకటించింది ట్రంప్‌నే. వాణిజ్యం నిలిపివేస్తానని ఇరు దేశాలను బెదిరించానని, వారిద్దరూ కాల్పుల విరమణకు అంగీకరించారని పదేపదే చెబుతూనే ఉన్నారు. అంతెందుకు ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్ ప్రయోజనాలకు నష్టం చేసేవే. తగిన పత్రాలు లేకుండా నివసిస్తున్న వారిని అవమానకరంగా కాళ్లకు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ విమానాల్లో తరలిస్తే.. చిన్న దేశాలుసైతం ప్రతిఘటించగా, విశ్వ గురుగా చెప్పుకునే పాలకుల నోరుపెగల్లేదు. టారిఫ్‌లు విధించకుండానే అమెరికా నుంచి వస్తూత్పత్తుల దిగుమతికి భారత్ అత్యుత్సాహం చూపిస్తోందని ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధ పరిస్థితుల వల్ల భారత్‌లో అత్యధికంగా ఐ ఫోన్లు తయారు చేయాలని యాపిల్ కంపెనీ నిర్ణయించింది. ప్రపంచంలో అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటని, అసలు టారిఫ్‌లే లేకుండా వస్తువులను దిగుమతి చేసుకోవడానికి భారత్ దాదాపు అంగీకరించిందని, భారత్‌లో ఐ ఫోన్ల తయారీ కర్మాగారాలను నిర్మించినా అసలు పట్టించుకోదని..ఇలా మన దేశం గురించి ఇష్టానుసారం మాట్లాడేశాడు. టారిఫ్‌లపై చర్చించేందుకు మన వాణిజ్య మంత్రి వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న సమయంలో.. వాణిజ్య చర్చల కోసం వెళ్లిన సమయంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం మరింత అభ్యంతరకరం. మన దేశంలో పెట్టాల్సిన యాపిల్ కంపెనీని నిలువరించానని స్వయంగా చెప్పుకున్నారు. వీటిపైనా ప్రధాని మౌనముద్ర కొనసాగించారు. టారిఫ్‌లుసహా సమగ్ర వాణిజ్య ఒప్పందంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయంటూ విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటించడమినహా ట్రంప్ అవాస్తవాలు చెబుతున్నారని ప్రకటించే ధైర్యం చేయలేదు. రెసిప్రోకల్ టారిఫ్స్ పేరుతో ఇప్పటికే అమెరికా విధించిన 26 శాతం టారిఫ్‌ల కత్తి వేలాడుతూనే ఉంది. ఇతర దేశాలతోపాటు 90 రోజుల వెసులుబాటు లభించిందంతే. మనదేశం తలవంచగా, టారిఫ్‌లపై గట్టిగా నిలబడిన చైనా%"% అమెరికా మెడలు వంచిన తీరును ప్రపంచమంతా చూసింది. అమెరికా ఏకపక్ష ధోరణులు, టారిఫ్‌లతో అంతర్జాతీయ శాంతి, సుస్థిరతలకు ముప్పు పొంచివుందని, అభివృద్ధి పునాదులు కదిలిపోతాయని 80కిపైగా దేశాల ప్రతినిధులు ఐరాసలో ఆందోళన వ్యక్తం చేసినా.. మన దేశానిది మూగనోమే! ట్రంప్ చెప్పినట్టు జీరో సుంకాలకు అంగీకరిస్తే.. అక్కడి వస్తువుల డంపింగ్‌తో మన వ్యవసాయంసహా అన్ని రంగాల్లో అధోగతే!

అమెరికాలోని వలసదారులు తమ మాతృదేశాలకు పంపే డబ్బుపై ఐదు శాతం రెమిటెన్స్ టాక్స్ విధిస్తానని తాజాగా ట్రంప్ ప్రకటించారు. అమెరికా శాశ్వత పౌరులు మినహాయిస్తే.. గ్రీన్‌కార్డుదారులతోపాటు హెచ్.. 1 బి, ఎఫ్ -1 లేదా జె-1 తదితర వీసాలపై అక్కడ ఉంటున్న భారతీయులంతా తాము పంపే ప్రతి లక్ష రూపాయల్లో ఐదు వేలు అమెరికాకు టాక్స్ కట్టాల్సిందే. 2024లో విదేశాల నుంచి రూ.10.7 లక్షల కోట్ల రెమిటెన్స్‌లు వస్తే.. అమెరికా నుంచే రూ.3 లక్షల కోట్లు వచ్చాయి. అమెరికాకు అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులు చెల్లించిన తరువాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కోసమో, ఇక్కడ ఆస్తులు కొనడం కోసమో పంపించే మొత్తంపై ఎన్ఆర్ఐలు రూ.15 వేల కోట్ల పైచిలుకు అమెరికాకు అప్పనంగా సమర్పించుకోవాలి. ఇటువంటి నష్టదాయకమైన అమెరికా ఏకపక్ష విధానాలను ధైర్యంగా ఎదుర్కోవడం అత్యవసరం. భారత సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం అవశ్యం.

## పేపర్ బోర్డు పేరుతో రియల్ దందా

ఖమ్మం, మే 21: పరిశ్రమల స్థాపనకు కారు చౌకగా ప్రభుత్వ భూములు పొంది నామమాత్రంగా పరిశ్రమలు స్థాపించినట్టు చేస్తూ ప్రభుత్వ భూము ల్లో అక్రమ వెంచర్లతో స్థిరాస్తి వ్యాపారం జో రుగా సాగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జి ల్లా చుంచుపల్లి మండలం, రామాంజనేయు కాలనీ పరిసర ప్రాంతంలో యదేచ్ఛగా ప్ర భుత్వ భూముల్లో అక్రమ వెంచర్లు గెలుస్తున్నాయి. సర్వే నెంబరు 137/1. 20 కుంటల ప్రభుత్వ భూమి కబ్జా చేసి ఈ భూమికి త ప్పుడు సర్వే నెంబర్ 137/2/o చూపి ప్రైవే ట్ పట్టా భూమి పేరుతో కాగితాలు సృష్టించారు. 2004 సంవత్సరంలో విజయవాడ కు చెందిన నాగ వెంకట శ్రీలక్ష్మి ఈ భూ మిని కొనుగోలు చేసి, బండా రామిరెడ్డి వద్ద నుండి ఓ అట్టల ఫ్యాక్టరీ నిర్మాణం చేశారు. ఈ ఫ్యాక్టరీ కి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నాయి. మరో చోట ఉన్న శ్రీ పద్మాలయ పేపర్ బోర్డ్స్ అనే ఫ్యాక్టరీ అ నుమతు లను చూపుతూ, ప్రభుత్వానికి చె ల్లించాల్సిన పన్నులకు వేగనామం పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. పద్మాలయ పేపర్ బోర్డ్స్ పాల్వంచ మండలం దంతాల బోర గ్రామానికి చెందిన ఒక గిరిజనుడిని బినామీగా నమోదు చేసినట్లు సమాచారం. ఇటీవల బినామీ గిరిజనుడికి, కర్మాగారం నిర్వహకులకు మనస్పర్ధలు వెలబడటంతో విష యం వెలుగు చూసింది. ఒకవైపు అనుమతులు లేకుండా అట్టాల ఫ్యాక్టరీ నడుపుతూ, మ రోవైపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ వెంచర్లతో భూదందా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న రెవెన్యూ, పంచాయతీ, పరిశ్రమల అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం తో పెద్ద మొ త్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఈ స్థలంపై ఎల్ టి ఆర్ కేసులు నమోదైన ఎటు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ కల్పించుకొని చెంచుపల్లి మండలం ఇండస్ట్రియల్ పార్కు ఏరియాలో జరుగుతున్న భూధందా పై సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వ భూములను పరిర క్షించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు


## అధికారుల అలసత్వం, వెల్లుల్ల పెద్ద చెరువుకు శాపం - కంతి హరికుమార్



మెట్ పల్లి మే 21: వర్షాకాలం సమీపిస్తున్నా వెల్లుల్ల పెద్ద చెరువు మరమ్మత్తులకు నోచుకోవడం లేదని వెల్లుల్ల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కంతి హరికుమార్ ఆరోపించారు. మత్స్య సహకార సంఘ సభ్యులందరు తరలివచ్చి చెరువులకు మరమ్మతులు చేయాలని మెట్ పల్లి ఆర్డీవో కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరిన పెద్ద చెరువు ప్రధాన తూము, మినీ తూములను మరమ్మత్తులు చేసి వాటిని పునరుద్ధరించాలని గత కొంతకాలంగా సంబంధిత ఎస్సారెస్పీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా చలనం లేదని మండిపడ్డారు. ప్రతి సీజన్ వర్షాకాలంలో భారీగా వచ్చి చేరిన వరద నీటితో చెరువుకు గండ్లు పడి సమీపంలోని రోడ్లు, పొలాలు కోతకు గురవుతున్నాయని, గతంలో అనుబంధ గ్రామమైన మాసాయిపేట రోడ్డు పూర్తిగా కొట్టుకుపోగా, పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వందల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే పెద్ద చెరువు పై స్థానిక మత్స్యకా రులు చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. శిథిలావ స్థకు చేరిన చెరువులు, కుంటలను పరిశీలించి యధావిధిగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా, అధికారుల నుండి స్పంద న లేకపోవడం విస్మయం కలిగిస్తుందని అన్నారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన శిథిలావస్థకు చేరిన తూములను పునరుద్ధరించి, పెద్ద చెరువును వరద నీటి ప్రమాదానికి గురికాకుండ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాలకవర్గ కమిటీ సభ్యులు టేల రాజయ్య, మంచాల జలపతి, ధ్యావని సత్తయ్య, పోచయ్య, చిన్న రాజయ్య, పర్రె చిన్నయ్య, భానుచందర్, బొబ్బిలి శంకర్, ముంజయ, అశోక్, రాజేశ్వర్, నీలి రాజారెడ్డి, విద్యాసాగర్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికీలలు మింగేస్తున్నా పాఠాలు నేర్వమా!

హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు కేంద్రాలు గా ఎలా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరోసారి స్పష్టం చేసింది. వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయ నుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి. నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేనివారితో చేయించిన తాత్కాలిక మరమ్మతులు%"%షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే పెయింట్లు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వాటిని అజాగ్రత్తగా నిల్వ చేయడం, మానవ నిర్లక్ష్యం కూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి. ప్రణాళికాబద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక



జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనాన్ని వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణా లతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసి వేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగిన ప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది. సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్, వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి. తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం, అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియలో లోపం%"%నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పని చేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు. అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహ న ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది. ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వ భవనాలకు తప్పనిసరిగా నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం, నీటి వనరుల లభ్యత (ఫైర్ హైడ్రెంట్లు) వంటివి వారికి తప్పనిసరిగా అందించాలి. పట్టణ ప్రణాళికలోనే అగ్ని భద్రతను ఒక భాగంగా చూడాలి. పాత భవనాలకు ఆధునిక భద్రతా సదుపాయాలను కల్పించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చి, క్రమంగా వాటిని తప్పనిసరి చేయాలి. మూడవది, భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా వహించాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. చివరగా, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక శిక్షణ ద్వారా పౌరులను అగ్ని భద్రతపై చైతన్యపరచాలి. ప్రమాదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి. అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నిబంధనలు పాటించని వారిపై ఫిర్యాదు చేయడానికి సులభ మార్గాలను అందుబాటులో ఉంచడం కూడా పౌర పర్యవేక్షణను పెంచుతుంది. అగ్ని భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, నిపుణుల సూచనలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. కావలసింది ఏమిటంటే, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిల నుండి సాధారణ పౌరుల వరకు అందరిలో నిబద్ధత, చట్టాలను పటిష్టంగా అమలు చేసే సంకల్పం, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతిని పెంపొందించడం, బాధ్యతాయుతమైన వారిపై చర్యలు తీసుకోవడం. అప్పుడే మనం ఇలాంటి విషాదాలు పునరావృతం కాని సురక్షితమైన నగరాలను నిర్మించగలం. చర్య తీసుకోవాల్సిన సమయం నిన్ననే గడిచిపోయింది. మరో ప్రమాదం జరిగే వరకు మనం వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది.


# వరంగల్ నుంచి రెండు వందేభారత్ ట్రైన్స్



వరంగల్, మే 21: వరంగల్ ప్రజలకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. మే నెల చివరి నాటికి రెండు వందే భారత్ స్లీపర్ రైళ్లు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లు ప్రయాణికులకు విమాన ప్రయాణ అనుభూతిని అందించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడ్డాయి. ప్రస్తుతం సికింద్రాబాద్ - విశాఖపట్టణం - సికింద్రాబాద్ మధ్య వరంగల్ మీదుగా రెండు వందే భారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. వీటికి అదనంగా స్లీపర్ తరగతి వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ రైళ్లలో కూర్చుని ప్రయాణించేందుకు చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ తరగతులు ఉన్నాయి. అయితే.. కొత్తగా ప్రవేశపెట్టనున్న స్లీపర్ రైళ్లు రాత్రి వేళ ప్రయాణించే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటాయి. వందే భారత్ రైళ్లు చాలా వేగంగా ప్రయాణిస్తున్నాయన్న సంగతి తెలిసిందే.. అయితే పడుకొని ప్రయాణించడానికి అవకాశం లేదని చాలా మంది ప్రయాణికులు నిరుత్సాహానికి గురవుతున్నారు. దూరం వెళ్లే వారు అంత సమయం కూర్చొని వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.. దీంతో కొత్తగా ప్రవేశపెట్టే వాటిలో ఈ సౌకర్యం ఉండనుంది. ఇక ఏం చక్కా పడుకొని మీ జర్నీని స్టార్ట్ చేయవచ్చు. స్లీపర్ రైలు ట్రయల్ రన్.. 180 కిలో మీటర్ల వేగంతో దూసుకెళ్లిందిగంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. మొదటి దశలో దేశవ్యాప్తంగా 9 రైళ్లు ప్రవేశపెడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు 2 రైళ్లు కేటాయించారు. రెండు రైళ్లు వరంగల్ మీదుగా ప్రయాణి స్తాయి. ఒకటి విజయవాడ నుండి అయోధ్య (వారణాసి) వరకు, మరొకటి సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు నడుస్తాయి. ప్రతి రైలులో 16 బోగీలు ఉంటాయి .రైల్వేశాఖ ఈ రైళ్ల టికెట్ ధరలు, ఆగే స్టేషన్ల వివరాలను ఇంకా వెల్లడించలేదు. ఈ నెలాఖరులోగా వీటిని ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ మీదుగా స్లీపర్ వందే భారత్ రైళు ప్రారంభం కానుండటం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పడుకొని వందేభారత్ రైళ్లో ప్రయాణించాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.

## అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి ప్రతినిధి: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దళితుడని వివక్ష చూపుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి డిసిపి కరుణాకర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గం నుంచి ఎంపీగా గెలిచిన గడ్డం వంశీకృష్ణ పట్ల మొదటి నుంచి ప్రోటోకాల్ పాటించకుండా, ఎంపీకి ఎలాంటి అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించ కుండా వివక్ష చూపుతున్నా రన్నారని మండిపడ్డారు. ఇ టీవల జరుగుతున్న కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల నేపథ్యం లో ఎంపీ వంశీకృష్ణకు ఆహ్వానం లేకపోగా దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో ఎంపీ ఫోటో లేకపోవడం దళితులను అవమానించడమే నన్నారు. గత వారం రోజులుగా ఎంపీకి మద్దతుగా, అధికారులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేకపోవడంతో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి అధికారులకు జ్ఞానోదయం కలగాలని కోరినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ మెంబర్ సయ్యద్ సజ్జాద్, దళిత సంఘాల నాయకులు బొంకూరు కైలాసం, కుక్క చంద్రమౌళి, అమర జ్యోతి, కాంగ్రెస్ నాయకులు బాలసాని సతీష్, ప్రశాంత్, బండారు సునీల్, రవి తదితరులు పాల్గొన్నారు.





# శ్రీరామదూతం శిరసా నమామి

## నేడు హనుమత్ జయంతి

శ్రీరాముడి దాసుడు హనుమంతుడు. 'ఓ రామదూతా! నీకు నమస్సులు' అనే భావోద్వేగంతో ఎంతోమంది భక్తులు హనుమంతుడిని సేవిస్తుంటారు. భగవత్ సేవకు కావాల్సిన అహేతుకమైన నిబద్ధత, అపారమైన శక్తి, అమితమైన భక్తి, అచంచలమైన దాస్యభావం ఆంజనేయుడి సొంతం. రామనామాన్ని స్మరించడం వల్లే ఆయన చిరంజీవిగా నిలిచాడు. హనుమంతుడు ఎంతో శక్తిమంతుడే కాదు, భక్తిపరంగా అత్యుత్తముడు. భగవంతుడి దాసునిగా జీవించడం వల్లే ఆయన మహోన్నతిని సాధించాడు. నవవిధ భక్తి మార్గాల్లో 'దాస్యం' అనే అంగానికి ప్రతీకగా భాగవతంలో హనుమంతుడిని ప్రస్తావిస్తారు. 'హనుమంతుడు చేసింది ఒక్కటే.. శ్రీరాముడు చెప్పిన విధంగా సేవచేయడం. ప్రశ్నించలేదు, ఆలస్యం చేయలేదు. రాముడు చెప్పిన పనిని శిరసావహించి చేశాడు. లక్ష్మణుడికి ఔషధం తెచ్చే పని అప్పగించగానే.. పర్వతాన్ని ఆసాంతం తీసుకురావడం, రావణుడి నగరాన్ని ధ్వంసం చేయడం ఇలా ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తాయి. సర్వదా రామదాసుడిగా ఉండాలనే కోరుకున్నాడు హనుమ. ఆయన మోక్షం కోరుకున్నవాడు కాదు. సర్వలోకాధికారాన్ని ఆశించలేదు. ఆయన కోరుకున్నది ఒక్కటే.. శ్రీరాముడి సేవ చేసే అవకాశమే తరతరాలకు దక్కాలి' అని శ్రీల ప్రభుపాదుల వారు ఆంజనేయుడి రామభక్తిని చాటారు.

భవబంధచ్ఛిదే తస్మై స్పృహయామి న ముక్తయే<br>
భవాన్ ప్రభురహం దాస ఇతి యత్ర విలుప్యతే<br>
(చైతన్య చరితామృత, ఆది లీల 6.42)

'ఓ ప్రభూ! మోక్షం ప్రసాదించాలనుకుంటే ప్రసాదించండి. కానీ, నేను మాత్రం మీ దాస్యభావాన్ని కోల్పోవడాన్ని మాత్రం అస్సలు ఆశించను' అని కోరాడట హనుమ. అంతటి దాస్యభక్తి వీరాగ్రణి ఆంజనేయుడు. ఒకసారి శ్రీరాముడు అగస్త్యమునితో.. 'వాలి, రావణుల శక్తులు.. హనుమంతుడి బలానికి సమానంగా రావు. శక్తి, బుద్ధి, సహనం, ధైర్యం, విజ్ఞానం- ఇవన్నీ ఆంజనేయుడిలో సమపాళ్లలో ఉన్నాయి. లంకను జయించి, సీతామాత సందేశాన్ని తెచ్చిన ఘనత పూర్తిగా అంజనీపుత్రుడిదే' అని అన్నాడట. రామాయణ, భాగవతాది శాస్త్రాల్లో హనుమంతుడి అసామాన్యమైన సాహసోపేత కృత్యాలెన్నో కనిపిస్తాయి. వాస్తవానికి అసంఖ్యాకమైన హనుమంతుడి లీలలను వర్ణించడం మనకు సాధ్యం కానిది. అయితే, నిత్యం శ్రీరాముడి గుణగణ వైభవాన్ని స్తుతించడం హనుమలో ఒక గొప్ప గుణంగా అభివర్ణించవచ్చు. ఎక్కడ శ్రీరామకథా గానం చేస్తారో.. అక్కడ హనుమంతుడు కూడా ఆసీనుడై భక్తుల సేవా సంకల్పాన్ని మరింత బలపరుస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.

యత్ర యత్ర రఘునాథ కీర్తనం<br>
తత్ర తత్ర కృతమస్తకాంజలిం<br>
బాష్పవారి పరిపూర్ణ లోచనం<br>
మారుతిం నమత రాక్షసాంతకమ్

రామనామ గానం ఎక్కడైతే జరుగుతుందో అక్కడ హనుమంతుడు కూడా ఉంటాడన్నది భక్తుల నమ్మకం. ఈ భక్తాగ్రేసరుడు భక్తకోటికి విలువైన సూచన చేశాడని భాగవతం ద్వారా తెలుస్తుంది.

సురోవసురో వాప్యథ వానరో నరః<br>
సర్వాత్మనా యః సుకృతజ్ఞముత్తమమ్<br>
భజేత రామం మనుజాకృతిం<br>
హరిం య ఉత్తరాననయత్కోసలాన్దివమితి<br>
(శ్రీమద్భాగవతం 5.19.8)

'సురులు గానీ, అసురులు గానీ, నరులు గానీ, వానరులు గానీ, మానవమాత్రునిగా ఈ లోకంలో అవతరించిన దేవాదిదేవుడైన ఆ శ్రీరామచంద్ర ప్రభువును ఆరాధించాలి. భక్తుడు ఆచరించే తృణమా త్రపు సేవనైనా ప్రేమతో స్వీకరించే ఆ స్వామిని సేవించడానికి కఠోర తపస్సులు ఆచరించ అవసరం లేదు. భగవంతుడు ప్రీతి చెందితే, తన భక్తుడికి సార్థకత చేకూరినట్టే. రామచంద్రుడు అయోధ్య వాసులందరికీ తన స్వధామాన్ని (వైకుంఠాన్ని) అనుగ్రహించాడు' అని పలికిన హనుమంతుడి మాటలు రామభక్తులకు కొండంత బలాన్నిస్తాయి. ఈ కలియుగంలో భగవంతుడిని ప్రసన్నం చేసుకోవ డానికి అత్యుత్తమ మార్గం హరినామ సంకీర్తన. ఆంజనేయుడిలా మనం కూడా సేవా దాస్యభావంతో'హరే కృష్ణ.. హరే రామ' మహామంత్రాన్ని జపిద్దాం. 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే' ఈ మంత్రం ద్వారా మనం కూడా శ్రీరాముడి సమీపాన్ని పొందగలం. హనుమం తుడి ఆశీస్సులతో మన భక్తి మరింత పరిపక్వమవుతుంది.

# డీ.ఈ.ఈ.టి ద్వారా యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి: డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ద్వారా వచ్చే అవకాశాలను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో డీఈఈటి పని తీరు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు అందించే పరిశ్రమలు, వివిధ వాణిజ్య సంస్థలకు నిరుద్యోగులకు వారధిగా పనిచేసేందుకు ప్రభుత్వం డీఈఈటిను ఏర్పాటు చేసిందన్నారు. మన జిల్లాలో డీ.ఈ.ఈ.టి ప్లాట్ ఫారం పై 1810 మంది యువత ఉపాధి అవకాశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నా రని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకా శాలు పొందేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంద ని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఇందులో తప్పనిసరి గా రిజిస్ట్రేషన్ చేసుకుని అవకాశాలను వినియోగించు కోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో డీ.ఈ.ఈ.టీ పట్ల విస్తృత ప్రచారం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. డీ.ఈ.ఈ.టి ప్లాట్ ఫారం ద్వారా యువతకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయని, వారి నైపుణ్యాల ఆధారంగా అర్హత గల ఉద్యోగాన్ని, నైపుణ్యాలను పెంచుకునేందుకు శిక్షణ సంస్థల సమాచారాన్ని, విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అప్రెంటిషిప్ లకు సంబంధించిన సమాచారం అందుతుంద న్నారు. ఈ సమావే శంలో జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్,డి. ఆర్.డి.ఓ. కాళిందిని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వివాదాల్లో ఎంపీ రఘునందనరావు..?



మెదక్, మే 21,: ఇన్నాళ్లపాటు తన వాగ్ధాటితో.. ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఒక్కసారిగా ఇబ్బందుల్లో పడ్డారు. ఓ భూ వివాదాన్ని గులాబీ సోషల్ మీడియా తెరపైకి తీసుకువచ్చింది.వివాదాన్ని గులాబీ పార్టీకి అనుకూలంగా పనిచేసే సోషల్ మీడియా సంస్థ రఘునందన్ రావు ప్రమేయం ఉందన్నట్టుగా భూముల వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చింది. భారత రాష్ట్ర సమితికి అనుకూలంగా పనిచేసే ఆ సోషల్ మీడియా ఎక్స్ ఫోజ్ చేసిన వివరాల ప్రకారం.. 84 ఎకరాల భూమిని రఘునందన్ రావు అక్రమంగా కొట్టేసారట. ఆ భూములు మొత్తం కూడా అసైన్డ్ వట. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రఘునందన్ రావు అక్రమంగా ఈ భూములను తన పేరు, మన కుటుంబ సభ్యుల పేరు మీద చేయించుకున్నారట. దుబ్బాక నియోజకవర్గం లోని అక్బర్ పేట్ ? భూమ్ పల్లి మండలం చౌదర్ పల్లి గ్రామంలోని వడ్డెర, దళిత కుటుంబాలకు సంబంధించిన 84 ఎకరాల లావుణి భూమి ఉన్నది. ఇది అసైన్ రకానికి చెందినది. అయితే ఈ భూములను రఘునందన్ రావు కొనుగోలు చేసినట్టు భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. ఆ ఆరోపణలకు తగ్గట్టుగానే.. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం కూడా తెరపైకి కీలకమైన ఆధారాలను తీసుకొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూమిని రఘునందన్ రావు క్లియర్ పట్టా చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూభారతిలో అసైన్డ్ భూములు పట్టాగా మార్చుకునే అవకాశం ఉందని.. అందువల్లే రఘునందన్ రావుకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. 84 ఎకరాల చుట్టూ రఘునందన్ రావు కంచె వేశారట. అక్కడికి ఎవరూ వెళ్లకుండా బౌన్సర్లతో సెక్యూరిటీ ఏర్పాటు చేశారట.. దీనిపై వట్టెం రామకృష్ణ అనే న్యాయవాది కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో ఈ భూముల బాగోతం బయటికి వచ్చిందని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది?ఈ వ్యవహారం బయట పెడితే మీడియా సంస్థలకు నోటీసులు పంపిస్తున్నారని.. కేసులు వేసి బెదిరిస్తామని రఘునందన్ రావు భయపెడుతున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. ఇక ఇటీవల కేటీఆర్ కూడా పేరు ప్రస్తావించకుండా రఘునందన్ రావు పై ఆరోపణలు చేశారు. భూములు తన పేరు, కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ఆరోపించిన తర్వాత ఇంతవరకు ఆ పార్టీ ఒక్క ఆధారం కూడా బయట పెట్టలేదు. కానీ అనూహ్యంగా రామకృష్ణ అనే న్యాయవాది ఈ వివరాలను బయట పెట్టడంతో.. ఇదేదో తమకృషి వల్లే అన్నట్టుగా భారత రాష్ట్ర సమితి అనుకూల సోషల్ మీడియా విభాగం తెగ ప్రచారం చేసుకుంటున్నది. అంతేకాదు ఆ భూములపై డ్రోన్ ద్వారా తీసిన వీడియోలను సోషల్ మీడియాలో తెగ పోస్ట్ చేస్తున్నది. అయితే 84 ఎకరాల భూమిని రఘునందన్ రావు, ఆయన భార్య మంజుల, కూతురు సింధు పేరు మీద చేయించారని భారత రాష్ట్ర సమితి అనుకూల సోషల్ మీడియా విభాగం ఆరోపిస్తోంది. త్వరలోనే మరిన్ని వివరాలు బయటపెడతామని చెబుతోంది. అయితే రాజకీయ దుగ్ధ తో నేరుగా రఘునందన్ రావు పై ఆరోపణలు చేస్తోంది. అంతేకాదు రఘునందన్ రావు వివరణ లేకుండానే ఏకపక్షంగా ఆరోపణలు చేస్తుంది. అయితే రఘునందన్ రావు మాత్రం లీగల్ నోటీసులు పంపిస్తూ.. సదరు సంస్థలపై పరువు నష్టం దావా వేస్తున్నట్టు చెబుతున్నారు.. చూడాలి మరి ఈ భూముల వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో? అన్నట్టు ఈ భూములను తమ ఇష్టానుసారంగా అమ్మినట్టు అక్కడి రైతులు చెబుతున్నారు. అలాంటప్పుడు ఇందులో వివాదం ఏముందో అర్థం కావడం లేదని బిజెపి నాయకులు అంటున్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు నీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడము అర్ధరహితము

## -మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికారి కిషన్ జీ



మంథని ప్రతినిధి,మే 21: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడము అర్ధరహితమని మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికారి కిషన్ జీ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు విశేషంగా కృషి చేసిన విషయం ఎంపీ వంశీకృష్ణ కు తెలియదా అని ప్రశ్నించారు. పార్టీ అంతర్గత విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకుపోవాలి కానీ బజార్లో పడడం పార్టీ ప్రతిష్టకు దెబ్బ కదా అన్నారు.

రాజకీయాల్లో భవిష్యత్తు ఉన్న ఎంపీ ఇలా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. మంత్రి శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబును విమర్శించే స్థాయి ఎంపీ వంశీకృష్ణ కు లేదన్నారు. ఇప్పటికైనా పార్టీ లైన్ ప్రకారము నడుచుకోవాలని,పార్టీలో వర్గాలను సృష్టించి పెయిడ్ ఆర్టిస్టులతో ప్రెస్ మీట్ లు పెట్టించడం ధర్నాలు చేయించడం క్షమించరాని నేరంగా పరిగణించ వలిసి వస్తుందన్నారు. వ్యక్తి ప్రతిష్టను కాపాడుకోవడం కాదు పార్టీ ప్రతిష్టను కాపాడడం ముఖ్యం అనే విషయం ఎంపీ గడ్డం వంశీ కృష్ణ గుర్తెరిగి తన పద్ధతులు మార్చుకోవాలని అన్నారు. అందరిని అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి విషయంలో పోటీ పడాలని మంథని నియోజకవర్గంలో కార్యకర్తలను విభజించి పాలించే వాళ్లచే పత్రిక ప్రకటనలు ఇవ్వడం సరైన పద్ధతి కాదని గోటికార్ కిషన్ జీ హితవు పలికారు.

# దేశం కోసం ఎనలేని సేవలు చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

హుజురాబాద్: మే 21: దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్పనేత రాజీవ్ గాంధీ అని,దేశం కోసం వారి చేసిన సేవలు మరువలేనివని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని బస్ డిపో క్రాస్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ప్రణవ్.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి అందరికీ విద్యను అందించారని, జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేశారని,ఇప్పటికీ టెక్నాలజీ వ్యవస్థ ముందుకు పోతుంది అంటే అది రాజీవ్ గాంధీ తీసుకున్న కృషి అని అన్నారు.దేశంలోని పరిశ్రమలకు రాయితీలను కల్పించి అనేక సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి,హుజురాబాద్ టౌన్,మండల అధ్యక్షులు తిరుపతి,కిరణ్, హుజురాబాద్ టౌన్,మండల మహిళా అధ్యక్షురాలు పుల్ల రాధ,పుష్ప లత,వ్యవసాయ మార్కెట్ కమిటీ



చైర్మన్ రాజేశ్వరి-స్వామి రెడ్డి, డైరెక్టర్లు,హనుమాన్ దేవాలయ చైర్మెన్ శంకర్, డైరెక్టర్లు,మాజీ మున్సిపల్ చైర్మన్ విజయ్,చెల్పూర్ మాజీ సర్పంచ్ మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు, దశరథం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవీందర్, సోషల్ మీడియా ఇంచార్జి రాజు,యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తీరనున్న 3 జిల్లాల ప్రజల ఆశలు

నిజామాబాద్, మే 21: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల ప్రజల చిరకాల వాంఛ నెరవేర ఉంది. జాతీయ రహదారి 63 నువ్వు అభివృద్ధి పరుస్తూ నాలుగు లైన్ల రహదారిగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ కృషి మేరకు పనులు ప్రారంభం కానున్నాయి. మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఆర్మూరు, జగిత్యాల, మంచిర్యాల హైవే నిర్మాణానికి పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. చాలా కాలం నుంచి ఉన్న ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుంది.దీనికి సంబంధించి త్వరలో టెండర్లు ఆహ్వానించి మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎన్ హెచ్ 63 నీ నాలుగు లైన్లుగా విస్తరించి, పట్టణాలు మరియు గ్రామాల దగ్గర బైపాస్ నిర్మించబోతున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టు పూర్తి అవడానికి రూ.3,850 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కలలు కంటున్న కలలు త్వరలో నెరవేరబోతున్నాయి.ఏళ్ల తరబడి ఆర్మూరు, జగిత్యాల, మంచిర్యాల ప్రాంతానికి చెందిన ప్రజలు ఎదురుచూస్తున్న హైవేకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. తాజాగా ఈ రోడ్డు నిర్మాణానికి వీలుగా ఉండే విధంగా అటవీ మరియు పర్యావరణ అనుమతులు కూడా లభించాయి. దాంతో త్వరలో టెండర్లు పిలిచి నిర్మాణ పనులను చేపడతారు. మరో మూడు ఏళ్లలో ఈ హైవే పూర్తవుతుందని తెలుస్తుంది.ఎన్ హెచ్ 63 ప్రస్తుతం రెండు వరుసలుగా ఉంది. ఈ దారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో దీనిని నాలుగు లైన్లుగా నిర్మించాలంటే చాలామంది ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. డబుల్ ట్రాక్ రోడ్లో చాలామంది ప్రమాదాలకు గురయ్యారు. నిత్యం ప్రజల రావణ సరుకు రావణా భారీ వాహనాలతో పాటు అనేక వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తాయి.ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ మార్గాలని మరింత అభివృద్ధి చేయాలన్న అధికారుల కృషి ఫలించలేదు. కొన్ని కారణాల వలన అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా ప్రధానమంత్రి కార్యాలయం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ పని ప్రారంభం కానుంది. గత ఎన్నికల్లో పర్యటన నిమిత్తం నిజామాబాద్కు వచ్చిన జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ ఇచ్చిన హామీ మేరకు జాతీయ రహదారి 63 అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.దేశంలో ఉన్న కీలక జాతీయ రహదారులలో ఈ రహదారి కూడా ఒకటి. ఎన్ హెచ్ 63 రహదారి మహారాష్ట్రలో దౌండ్ దగ్గర మొదలయ్యి తెలంగాణ రాష్ట్రం, చతిస్గడ్ రాష్ట్రం మీదుగా 1065 కిలోమీటర్లు కొనసాగి ఒడిస్సా రాష్ట్రంలోని కోరాపూట్ లో ముగుస్తుంది. ఈ రహదారి తెలంగాణ రాష్ట్రంలో బోధన్, నిజామాబాద్, ఆర్మూరు, మెట్పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేట, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూరు ప్రాంతాలమీదుగా ఈ రహదారి ఉంటుంది.

## ఊరటనిచ్చే శాంతివచనం కావాలి !

తిరుమల, : బాధాతప్త హృదయానికి ఊరట కలిగించేది స్నేహస్పర్శ ఒక్కటే. అది ఆర్ద్రమైన సానుభూతికి స్పష్టమైన సంకేతం. అటువంటి విజయం సాధించినవారికి- ఒక్క అభినందన, మెచ్చుకోలు నిరంతర విజయ పరంపర కలిగిస్తాయి.సర్వ ప్రాణికోటికీ నేను మిత్రుణ్ని అని తెలిసినవాడు శాంతి పొందుతాడు' అని శ్రీకృష్ణ ఉవాచ. ' ఎందుకంటే ఈ భూమండలం మీదున్న ప్రాణకోటితోనే మన జీవనం పెనవేసుకుని ఉంది.అలాగా తోటివారిని గౌరవిస్తూ వారితో కలసిమెలసి బతకడం నేర్చుకోవాలి. నాకు వారంతా తెలుసు' అనే అహంభావం కాదు, 'వారందరికీ నేను తెలుసు' అనుకోవడంలోఎంతో సంతోషం ఉంటుంది. నిస్వార్థమైన ప్రేమ గల హృదయ కవాటాలు ఎప్పుడూ తెరుచుకునే ఉంటాయి. అసంఖ్యాక మిత్రుల్ని అవి ఆహ్వానిస్తాయి. నాలుగు మంచి మాటల వల్ల పోయేదేముంది- అహం తప్ప! సమస్తమూ శుభంగా సుఖంగా ఉండాలన్న అభిలాషను మన సనాతన ధర్మం ప్రస్ఫుటం చేస్తుంది. నలుదిశలా జ్ఞానకాంతులు ప్రసరించినప్పుడు, మనిషిలో ఆ తేజం ప్రతిఫలిస్తుంది. అటువంటి వికాసాన్నే అతడు ఆహ్వానించాలి. సానుకూల దృక్పథాన్ని అలవరచుకుంటే- మనసులో స్వార్థానికి, ద్వేషానికి తావు ఉండదు. కాలం ఇచ్చే అవకాశాల్ని అందిపుచ్చుకోవాలే తప్ప, సాటివారివి దోచుకోకూడదు. అదే విశ్వహిత కాంక్ష!శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన గిరిని తన చిటికెన వేలితో ఎత్తి పట్టుకున్నప్పుడు, అక్కడి జనమంతా నిశ్చింతగా ఆ పర్వతం కిందకు వెళ్లి తలదాచుకున్నారు. అది తమమీద పడుతుందని అనుమానించినవారు బయటే ఉండిపోయి, ఇంద్రుడు సృష్టించిన రాళ్లవాన బారినపడ్డారు. కృష్ణభక్తులకు నమ్మకమే శ్రీరామరక్ష అయింది. విశ్వాసాన్ని మనిషి ఇతరుల నుంచి సాధించుకోగలగాలి.



# ఈ పండ్లను మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## వీటి లాబాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు..!

స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్ బెర్రీ.. ఇలా అనేక రకాల బెర్రీ పండ్ల గురించి మీరు వినే ఉంటారు. ఆయా పండ్లను చూసి కూడా ఉంటారు. కానీ మల్బెర్రీ పండ్లను మీరు ఎప్పుడైనా చూశారా..? ఈ పేరును చాలా మంది వినే ఉంటారు. కానీ ఈ పండ్లను చూసి ఉండరు. మనకు రహదారుల పక్కన లేదా స్టోర్స్‌లో మల్బెర్రీ పండ్లను బాక్సుల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ఇవి ఎంతో తియ్యగా ఉంటాయి. చూసేందుకు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మల్బెర్రీ పండ్లు సాధారణంగా తెలుపు, ఎరుపు, బ్లాక్ రంగుల్లో ఉంటాయి. అయితే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్‌బెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

రోగాలు రాకుండా రక్షణ..: రెస్వెరెట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ బెర్రీ పండ్లలో అధికంగానే ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇదే పోషక పదార్థం రెడ్ వైన్‌లోనూ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. గుండె కండరాలు వాపులకు గురి కాకుండా చూస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: మల్బెర్రీ పండ్లను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో 1-డిఆక్సీనోజిరిమైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కార్బొహైడ్రేట్లను శరీరం త్వరగా గ్లూకోజ్‌గా మార్చకుండా చూస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ పెరగవు, నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. మల్బెర్రీ పండ్లలో జియాజంతిన్, లుటీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. కళ్లు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది.

క్యాన్సర్ రాకుండా..: మల్బెర్రీ పండ్లలో బయెూ యాక్టివ్ సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే ఆంథో సయనిన్స్, రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనాల్ల క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకో వచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ కె, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగామార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లన తినడం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇలా మల్బెర్రీ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


# సెగగడ్డలు బాధిస్తున్నాయా..



ఈ కాలంలో శరీరంలో అధిక వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి.ఎగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది. రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్లు, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు.తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

### నేడు భారత పునరుజ్జీవన పితామహుడైన

# రాజా రామ్మోహన్ రాయ్ జయంతి



మంథని ): ఈయనొక సుప్రసిద్ధ భారతీయ సంఘ సంస్కర్త, రాయ్ రాథానగర్, బెంగాల్ లో మే 22, 1772 లో జన్మించాడు. కుటుంబంలో మతపరమైన వైవిధ్యం ఉంది. తండ్రి రమాకాంత్ ఒక వైష్ణవుడు కాగా, తల్లి తరిణి శాక్తమతానికు చెందింది. రామ్మోహన్ బెంగాలీ, పర్షియన్, అరబిక్, సంస్కృత భాషలను పది హేనో యేడు వరకు అభ్యసించాడు. 1828లో బ్రహ్మ సమాజంను స్థాపించారు. ఆ కాలంలో బ్రహ్మణేతరులతో కలిసి భోజనం చేశారు. ఉపనిషత్తుల్లోని నిరాకార తత్వాన్ని అంగీకరించి, మనవ సమాజంలో ఐక్యతను ఆకాంక్షించారు. అస్పృశ్యత, కులజాడ్యంపై చైతన్యం కలిగిం చారు. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా సతీసహగమనాన్ని నిషేధించారు. బ్రహ్మ సమాజ స్థాపకుడైన రాజా రామ్మోహన్ రాయ్ 1772లో బెంగాల్‌లోని బర్ద్వాన్ జిల్లా రాధానగర్‌లో జన్మించారు. 1815లో ఆత్మీయసభ అనే సంస్థను స్థాపించారు. భగవంతుడు ఒక్కడే అన్న సిద్ధాంతాన్ని ప్రచారం చేయడమే దీని ఉద్దేశం.హిందూ మతంలోని అనేక దురాచారాలను రూపుమాపడానికి, సంస్కరించడానికి 1828లో రామ్మోహన్ రాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. భారతీయ సామాజిక, మత సంస్కరణోద్యమానికి ఇది వెన్నుదన్నుగా నిలిచింది. ఆధునిక విద్యావ్యాప్తి, స్త్రీ జనోద్ధరణ కోసం విశేషంగా కృషి చేశారు. బహు భార్యత్వం, సతీసహగమనం లాంటి దురాచారాలను ఖండించారు. ఆయన కృషి ఫలితంగానే అప్పటి గవర్నర్ జనరల్ విలియం బెంటింక్ 1829లో రెగ్యులేషన్ ద్వారా సతీ సహగమనం చట్టవిరుద్ధమని ప్రకటించాడు. బాల్య వివాహాలు, కులవ్యవస్థలోని లోపాలపై పోరాడారు. అంటరానితనాన్ని అప్రజాస్వామ్యం, అమానుషమని పేర్కొన్నారు. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. స్త్రీ, పురుషులకు సమాన హక్కులుండాలని ఆయన గట్టిగా కోరారు.దేవుడికి, ప్రజలకు మధ్యవర్తులుగా ప్రత్యేక సౌకర్యాలు పొందుతున్న పురోహితుల తరగతిని రాజా రామ్మోహన్ రాయ్ నిరసించారు. రంగు, జాతి, కులాలకు అతీతంగా మానవులందర్నీ ఏకం చేయడానికి ఆయన కృషి చేశారు. కానీ బ్రిటిష్ పాలన పట్ల మాత్రం కొంత సానుకూల వైఖరితో ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన సాంఘిక సంస్కరణలు, ఆధునిక విద్యా సంస్థల ఏర్పాటును ప్రశంసించారు. అయితే బ్రిటిష్ ప్రభుత్వం పత్రికల స్వాతంత్ర్యంపై పరిమితులు విధించడాన్ని, భారతీయులను ఉన్నత పదవులకు దూరంగా ఉంచడాన్ని వ్యతిరేకించారు. కలకత్తాలో హిందూ కళాశాల స్థాపనకు ప్రయత్నించారు.రామ్మోహన్ రాయ్‌కు 'రాజా' అనే బిరుదును ఇచ్చిన మొగల్ చక్రవర్తి రెండో అక్బర్ కోరిక మేరకు రాయ్ 1830లో ఇంగ్లండ్ రాజైన నాలుగో విలియం ఆస్థానానికి వెళ్లాడు. బ్రిటిష్‌వారు ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రామ్మోహన్ రాయ్ ద్వారా మొగలు చక్రవర్తి కోరాడు. అక్కడ మూడు సంవత్సరాలు గడిపిన రాయ్ 1833, సెప్టెంబరు 27న బ్రిస్టల్ నగరంలో మృతి చెందారు. ఇతనికి రాజా (మొగలు చక్రవర్తి 2వ అక్బర్ ఇచ్చాడు), ఆధునిక భారత దేశ పితామహుడు, పయనీర్ ఆఫ్ ఇండియన్ జర్నలిజం, బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు పితామహుడు, ఆధినిక భారత నిర్మాత అనే బిరుదులు ఉన్నాయి.

# ఈ అలవాటును తప్పించండి..

చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా



వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.

వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి.. వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

# చలో సిద్దేశ్వరం...

### ఈనెల 31న సంగమేశ్వరంలో జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయండి .


### రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవి రమణ పిలుపు

మైదుకూరు : చలో సిద్దేశ్వరం లో భాగంగా ఈనెల 31వ తేదీన కర్నూలు జిల్లా సంగమేశ్వరం దగ్గర జరిగే రైతు ప్రజా బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవి రమణ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ప్రొద్దుటూరు వచ్చిన ఆయన చలో సిద్దేశ్వరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని రైతు సోదరులందరితోపాటు ,ముఖ్యంగా ప్రొద్దుటూరు నియోజకవర్గం రైతు సోదరులకు ,రైతు శ్రేయోభిలాషులకు ,రైతు సేవా సమితి కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గ సమితి కలిసి ఈరోజు వినతి చేయడం ఏమంటే అన్ని రంగాల్లో వెనుకబడిన రాయలసీమకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల శాఖల ద్వారా నిధులు కేటాయించి పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు ,నగరి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వాటిని పూర్తిచేసి ఆయా ప్రాజెక్టుల కింద ఉండే ఆయకట్టు రైతులం దరికీ సాగునీటి అందజేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. అలాగే కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలు పట్టణంలో ఏర్పాటు చేయాలి. జాతీయస్థాయిలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని అలాగే రాష్ట్ర స్థాయి విద్య ,వైద్య కళాశాలలను రాయలసీమ జిల్లాలలో ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశా రు. పై సమస్యల పరిష్కారం కోసం రాజకీయ పార్టీలకు



అతీతంగా ,పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా సంగమేశ్వరం వద్ద సిద్దేశ్వరం ప్రజా ప్రాజెక్టు 9వ వార్షికోత్సవం సందర్భంగా జరిగే రైతు బహిరంగ సభలో ప్రొద్దుటూరు నియోజకవర్గ రైతులు, ప్రజలతో పాటు జిల్లాలోని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏవి రమణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి పోలవరమే కాదు అందరి ప్రదేశ్ అనే నినాదాన్ని వినిపించాలన్నారు. ఈరోజు ప్రొద్దుటూరులో రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్ష ,కార్యదర్శులు ఆవుల రఘు రాముడు, తోలమడుగు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పలువురిని చంపి మొసళ్లకు ఆహారంగా వేసిన సీరియల్ కిల్లర్..




## పెరోల్‌తో పరారైన 'డాక్టర్ డెత్' అరెస్ట్

న్యూఢిల్లీ: పలువురిని చంపి మొసళ్లకు ఆహారంగా వేసిన సీరియల్ కిల్లర్ పెరోల్‌పై బయటకు వచ్చి 'అదృశ్యమయ్యాడు. 'డాక్టర్ డెత్' గా పేరొందిన అతడి కోసం రెండేళ్లుగా పోలీసులు వెతుకుతున్నారు. నకిలీ గుర్తింపుతో ఒక ఆశ్రమంలో పూజారిగా ఉన్న అతడ్ని చివరకు అరెస్ట్ చేశారు. 67 ఏళ్ల దేవేందర్ శర్మ ఆయుర్వేద వైద్యుడు. అయితే 'డాక్టర్ డెత్' గా పేరుగాంచిన ఆయన పలు హత్యలకు పాల్పడ్డాడు. 27 హత్య, కిడ్నాప్, దోపిడీ కేసులతో కూడిన సుదీర్ఘ నేర చరిత్ర అతడికి ఉన్నదని ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్ బ్రాంచ్) ఆదిత్య గౌతమ్ తెలిపారు.కాగా, సీరియల్ కిల్లర్ దేవేందర్ శర్మ 1994లో గ్యాస్ డీలర్‌షిప్ వ్యాపారంలో నష్టపోవడంతో నేరాల బాటపట్టాడు. నకిలీ గ్యాస్ ఏజెన్సీని నిర్వహించడంతోపాటు అక్రమ అవయవ వ్యాపారంలోకి ప్రవేశించాడు. 1998- 2004 మధ్య అక్రమ కిడ్నీ రాకెట్‌ను నిర్వహించాడు. పలు రాష్ట్రాల వైద్యులు, మధ్యవర్తుల సహాయంతో 125కు పైగా అక్రమ కిడ్నీ మార్పిడికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని ఆ పోలీస్ అధికారి చెప్పారు. మరోవైపు 2002-2004 మధ్య దేవేందర్ శర్మ తన అనుచరులతో కలిసి పలువురు టాక్సీ, లారీ డ్రైవర్లను దారుణంగా హత్య చేశాడు. నకిలీ ప్రయాణికులతో వారిని ట్రాప్ చేసి చంపేవాడు. ఉత్తరప్రదేశ్ కాస్‌గంజ్‌లోని మొసళ్లున్న హజారా కాలువలో మృతదేహాలను పడేసి వాటికి ఆహారంగా వేసేవాడు. వారి వాహనాలను బ్లాక్ మార్కెట్‌లో అమ్మేవాడని పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ వివరించారు. కాగా, కిడ్నీ రాకెట్, వరుస హత్యలకు సంబంధించి దేవేందర్ శర్మను 2004లో పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ, రాజస్థాన్, హర్యానాలో నమోదైన ఏడు వేర్వేరు కేసుల్లో అతడికి జీవిత ఖైదు శిక్ష పడింది. గుర్గావ్ కోర్టు అతడికి మరణశిక్షను కూడా విధించిందని పోలీస్ అధికారి తెలిపారు. 2002-2004 మధ్య పలువురు టాక్సీ, లారీ డ్రైవర్లను దారుణంగా హత్య చేసిన కేసులో తీహార్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడని చెప్పారు. 2023 ఆగస్ట్‌లో పెరోల్ పొందిన అతడు మాయమయ్యాడని చెప్పారు. రాజస్థాన్ దౌసాలోని ఆశ్రమంలో నకిలీ గుర్తింపుతో పూజారిగా నటిస్తున్న దేవేందర్ శర్మను సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ వెల్లడించారు. మరోవైపు పెరోల్‌పై ఉన్నప్పుడు దేవేందర్ శర్మ పరారీ కావడం ఇదే మొదటిసారి కాదు. 2020లో 20 రోజుల పెరోల్ తర్వాత తిరిగి జైలుకు వెళ్లలేదు. ఏడు నెలల తర్వాత ఢిల్లీలో పోలీసులకు చిక్కాడు. 2023 జూన్‌లో సరితా విహార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అతడికి మళ్ళీ రెండు నెలల పెరోల్ మంజూరైంది. అనంతరం 2023 ఆగస్ట్ 3 నుంచి ఈ ఏడాది మే 19 వరకు ఆ సీరియల్ కిల్లర్ పరారీలో ఉన్నాడని పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ విరించారు.

# పుష్కర స్నానం చేసిన కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది మే 21: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఉదయం తన కుటుంబసభ్యులతో కలిసి త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం వ కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తూ పుష్కర స్నానాలు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటున్నారని తెలిపారు. పుష్కరాలు భక్తి, శ్రద్ధలకు ప్రతీకగా నిలుస్తున్నాయని, భక్తులు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేయడం వల్ల ఆధ్యాత్మికంగా శుభఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ నియమ నిష్టలతో, శాస్త్రోక్తంగా పుష్కర స్నానాలు చేయాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయ అధికారులు కలెక్టర్ కుటుంబానికి పూర్ణ సేవలు అందించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, పుష్కరాలకు సంబంధించిన ఇతర ఏర్పాట్లపై అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని తదనుగుణంగా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భక్తులు వాహనాల్లో అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనంగా పార్కింగ్ స్థలాలను కూడా గుర్తించనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వం నడుపాలంటే
# రైతులనే ముంచాల్నా




**-బిఆర్ఎస్ పాలన లో రైతే రాజు**
**- కాంగ్రెస్ అంటేనే కండిషన్ అప్లై**
**- చొప్పదండి మాజీ సుంకె రవిశంకర్**


చొప్పదండి ని.వ. మే 21: కాంగ్రెస్ పాలనలో రైతులు చావలేక బతుకుతున్నారని ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారి పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని అటు రైతు భరోసా అందక, ఇటు రుణమాఫీ కాక సాగు చేసేందుకు ఇక్కట్లు పడుతూనే ఉన్నారని కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలా ఉంటే సాగుకు నీళ్ల అందకపోవడంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వేసిన పంటను కాపాడుకునేందుకు నిన్నటి వరకు భగీరథ ప్రయత్నం చేశారని తెలిపారు. అయితే, రాత్రనక, పగలనక చెమట చిందించి పండించిన పంటను అమ్ముకునేందుకు ఇప్పుడు ఆపసోపాలు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పంటల సాగు, నీటి నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఈ ఏడాది యాసంగిలో గతం కంటే చాలా తక్కువగా పంటలు సాగయ్యాయని వరి విస్తీర్ణం చాలావరకు తగ్గిందని వ్యవసాయశాఖ అంచనా ప్రకారం%ా% 56 లక్షల ఎకరాల్లోనే వరి సాగైందనో తెలిపారు. అందులోనూ నాట్లేసిన తర్వాత నీళు అందక చాలామటుకు పొలాలు ఎండిపోయాయని ఇప్పుడు ఆ వచ్చిన కొంత దిగుబడిని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోతున్నదని ఈ రబీలో 137 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసిందని అయితే అందులో సగం వరకు అంటే 70 లక్షల టన్నులే కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆదిలోనే రైతులను నిండా ముంచిందని పేర్కొన్నారు. కొనుగోలు చేసే ఆ కొంత ధాన్యాన్ని సేకరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రణాళికలు రచించిన వ్యవసాయ శాఖ.. ఇప్పటివరకు వందల్లోనే కేంద్రాలను ప్రారంభించడం విడ్డూరం. ఇదే అదనుగా దళారులు అందినకాడికి రైతన్నలను దోచుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఉదాహరణకు నల్గొండ జిల్లాలోని రైతన్నలను రైస్ మిల్లుల యాజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. వాస్తవానికి క్వింటాల్ వరి ధాన్యానికి రూ. 2,300 మద్దతు ధర కేంద్రం ప్రకటించిందని అయితే, ఈ ధర ఏ ఒక్క రైతుకు కూడా దక్కడం లేదని ఇటీవల కురిసిన నాలుగు చినుకులను సాకుగా చూపుతూ దళారులు, మిల్లర్లు రైతులకు మద్దతు ధర రాకుండా ఎగనామం పెడుతున్నారని. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతన్నలు దిక్కులేక దళారుల చేతుల్లో చిక్కి మోసపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ క్వింటాలు వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని వాగ్దానం చేసిందని తెలిపారు. వానకాలం పంట కొనుగోలు సమయంలో ఈ హామీని కాంగ్రెస్ సర్కార్ తూతూ మంత్రంగా అమలుచేసి చేతులు దులుపుకొన్నదని ఇప్పుడైతే ఏకంగా బోనస్ మాటనే ఎత్తడం లేదని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, వడ్లు కొనుగోలు చేస్తే బోనస్ చెల్లించాల్సి వస్తుందేమోనని ప్రభుత్వం జంకుతున్నదని ఆరోపించారు. రైతులు ఈ దుస్థితికి చేరడానికి ముఖ్య కారణం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే. సాగునీటి నిర్వహణపై రేవంత్ ప్రభుత్వానికి కనీస అవగాహన లేదు. కేవలం కేసీఆర్‌పై అక్కసు తో రైతులపై రేవంత్ కక్షగట్టారనో కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి, పంటలను పండబెట్టారని కాళేశ్వరం సహా రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌ను ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో ఓ దిక్కు ప్రభుత్వం పరాచికాలాడుతుంటే ఇంకోదిక్కు ప్రకృతి కూడా వారిపై పగబట్టిందని అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా రైతులకు కన్నీళ్లే మిగిలాయి. అకాల వర్షానికి వడ్ల రాశులు తడిసిపోవడం చాలా బాధాకరమని తెలిపారు. నా నియోజకవర్గమైన చొప్పదండి వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అకాల వర్షం కారణంగా చాలా చోట్ల వడ్లు రాలిపోయాయని దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని కనీసం వరి గడ్డి కూడా పనికి రాకుండా పోయింది. రాష్ట్రంలోని రైతన్నలు రాజులవుతున్న దశలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అంతే అప్పటి నుంచి రైతుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందని తెలిపారు. అట్లా కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు దెబ్బ మీద దెబ్బ తాకుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో కర్షకులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్నది. కేంద్రం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ. 2,300 మద్దతు ధరతో పాటు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించి రైతులకు అండగా నిలవాలి. రాష్ట్రంలో పండిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మిన రైతులతో పాటు తప్పని పరిస్థితుల్లో మిల్లర్లకు విక్రయిస్తున్న వారికి కూడా బోనస్ చెల్లించాలని వస్తూ వస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంట తీసుకువచ్చిన కరువు కారణంగా రైతు కరువు కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నాడని తెలిపారు.. ఈ సమయంలో కూడా ప్రభుత్వం విత్తనాల ధరలు పెంచి, లిక్కర్ ధరలు పెంచి ప్రభుత్వాన్ని నడిపే దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రోడ్డుకు ఇరువైపులా
# చెట్లు

**ఇబ్బందిపడుతున్న వాహనదారులు**



తాండూర్21: తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామపంచాయితీ లోని క్వాటర్స్ నుండి చంద్రపల్లి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చెట్లు అడ్డంగా ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నంత అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



# ఉగ్రవాద నిర్మూలనే మోదీ సర్కార్ లక్ష్యం



**ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతమొందించాల్సిందే**
**పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చింది**
**ఉగ్రవాద నిర్మూలనకు యుద్ధంలో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు**
**ఉగ్రవాద శిబిరాల ధ్వంసంతో దేశ సైనిక సత్తా ప్రపంచానికి తెలిసింది**
**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు**
**యాంటీ టెర్రరిజం డే ర్యాలీని ప్రారంభించిన కేంద్ర మంత్రి**

కరీంనగర్ మే 21: ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. ఉగ్రవాద వ్యతిరేక దినం' సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే...ప్రపంచంలో టెర్రరిజాన్ని అణిచివేసే శక్తి సామర్థ్యాలు భారత్ కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించింది. పెహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం టెర్రరిస్టుల స్థావరాలను గుర్తించి ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన మన సైన్యం ధైర్య సాహసాలను చూశాం. పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మారింది. టెర్రరిస్టులను ప్రోత్సహిస్తూ ఆ దేశం ఆర్థిక సాయం చేస్తోంది. నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. ముంబయి పేలుళ్లు, లుంబినీ పార్క్, గోకుల్ ఛాట్ పేలుళ్లు, మక్కా మసీదు పేలుళ్ల తరువాత దేశ ప్రజల్లో మార్పులు వచ్చాయి. అవసరమైతే దేశం పక్షాన టెర్రరిజంపై యుద్ధం చేసేందుకు సిద్దంగా ఉండటం సంతోషకరం. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాల్లో సామాన్య ప్రజలను, వారి ఆవాసాలను టార్గెట్ చేసి ధ్వంసం చేయాలనుకుంది. టెక్నాలజీని ఉపయోగించుకుని వాటిని తిప్పికొట్టిన ఘనత మన సైన్యానిదే. మోదీ నాయకత్వంలో అమిత్ షా సారథ్యంలో టెర్రరిజం ఏ రూపంలో అంతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. సామాన్య ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సైన్యానికి మద్దతుగా నిలవడం దేశ భక్తికి నిదర్శనం. చిన్నా పెద్దా ముసలి ముతక తేడా లేకుండా టెర్రరిజం అంతం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మట్టుపెట్టాల్సిందే. ఇందులో మరో ఆలోచనే లేదు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం వాళ్లు ముందుకొచ్చి ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉంది.

# సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న ఈపి ఆపరేటర్ల మరియు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

**భూపాలపల్లి ఏరియా జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి కి వినతిపత్రం అందజేసిన ఆపరేటర్లు**



మణుగూరు మే 21: బీసింగరేణి వ్యాప్తంగా ఓసి గనులలో పనిచేస్తున్న ఆపరేటర్ల మరియు డ్రైవర్ల ప్రధాన సమస్య సూటబుల్ జాబ్ తోపాటు ప్రమోషన్ పాలసీ ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈపి ఆపరేటర్ల ఆధ్వర్యంలో బుధవారం నాడు భూపాలపల్లి ఏరియా జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి కి ఆయన కార్యాలయంలో సింగరేణి ఈపీ ఆపరేటర్స్ అండ్ డ్రైవర్ అసోసియే షన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో కేంద్ర కమిటీ నాయకులతో కలిసి భూపాలపల్లి డివిజన్ తో పాటుగా సింగరేణి సంస్థలోని అన్ని డివిజన్లల్లో విదులు నిర్వహిస్తున్న ఈ పి ఆపరేటర్ల సమస్యలు మరియు వారికి న్యాయంగా రావలసిన ప్రమోష న్లు తదితర సమస్యలపై చర్చించి వినతి పత్రం అందించటం జరిగిం ది. కార్యక్రమానికి ముందు మర్యాదపూర్వకంగా జిఎం గారికి పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఆత్మీయ సత్కార కార్యక్రమంలో నిర్వహి ంచారు అనంతరం నాయకులు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఆపరేటర్లు మరియు డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆయా ఏరియాలో జిఎం గారి ద్వారా సింగరేణి సిఎండి శ్రీ ఎన్ బలరాం కి దృష్టికి తీసుకు వెళ్లే విధంగా అవి పరిష్కారానికి నోచుకునే విధంగా విధంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ నాసర్ పాషా , సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఐరేని ఉదయ్ కుమార్ , సెంట్రల్ కమిటీ సంయుక్త కార్యదర్శి కట్కూరి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి



నర్సంపేట మే 21: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని,రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు అన్నారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ను సందర్శించారు. మార్కెట్లో ధాన్యం రైతులను కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో ధాన్యం కొనుగోలుకు సరిపడ కాంటాలు పెట్టకపోవడం, పెట్టిన ధాన్యాన్ని వెంటనే షిఫ్ట్ చేయకపోవడం వలన మందకోడీగా కాంటాలు జరుగుతున్నట్లు రైతులు వాపోయరని అన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని వేలాది ఎకరాలలో రైతాంగము వరి పంట నూర్పిడి చేసి కల్లాలు తీసుకొచ్చి అమ్ముకోవడం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో ఖరీద్ దార్లు బార్ధాన్ సప్లై చేయక,కాంటాలు సక్రమంగా పెట్టకపోవడం వల్ల సుమారుగా రెండు వారాల నుంచి కల్లాల మీద ధాన్యాన్ని పోసుకొని రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. వర్షాలు రావడంతో కల్లాల మీద ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునే ఏర్పాట్లు లేకపోవడంతో వర్షానికి దాన్యం తడిసి ముద్దయిందని,రైతాంగము ఎం చేయాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వలన రైతులు నిండా మునిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శించాడు. ప్రభుత్వము మంత్రులు చెబుతున్నట్టుగా తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడమే కాకుండా బోనస్ కూడా రైతాంగానికి చెల్లించాలని డిమాండ్ చేశాడు. అదే సందర్భంలో సమస్యను నర్సంపేట రెవిన్యూ డివిజనల్ అధికారి దృష్టికి చరవాణి ద్వారా తీసుకపోవడం జరిగిందన్నాడు. రైతులు తీవ్రమైన అవస్థల్లో ఉంటే అధికారులు ఎవరూ పట్టించు పోకపోవడం చాలా దారుణమని అన్నాడు. ఆర్డిఓ వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చరవాణిలో రైస్ సంఘం నేతలకు హామీ ఇచ్చారని,నేటి వాతావరణం పరిస్థితులు చూస్తే వర్షాలు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపించట్లేదని,అధికారులు వెంటనే రైతుల వద్దకు వెళ్లి ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని రైతాంగానికి భద్రత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోరబోయిన కుమార్ స్వామి, సిపిఎం నర్సంపేట పట్టణ కార్యదర్శి హనుమకొండ శ్రీధర్, గొర్రెల మేకల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, కుక్కల సతీష్, గడ్డమీద బాలకృష్ణ, కలకోట్ల అనిల్, దాసరి నరేష్, జెట్టి రాజు, జగన్నాథం, కార్తీక్, జాటోద్ వీరన్న, కందికొండ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడులో రాజీవ్‌గాంధీ వర్ధంతి

జూలూరుపాడు, మే 21 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. జూలూరుపాడు ప్రధాన సెంటర్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ బడుగు, బలహీన వర్గాల కోసం సేవలందించిన మహనీయుడు అన్నారు. ఆయన ప్రజల గుండెల్లో నిత్య సజీవుడనని కొనియాడారు. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జూలూరుపాడు మండలాధ్యక్షుడు మంగీలాల్ నాయక్, వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధు, సూదన్ రావు, కాకర్ల మాజీ ఎంపీటీసీ సతీశ్, కాంగ్రెస్ నాయకులు సుమంత్, రోకటి సురేశ్, రామిశెట్టి రాంబాబు, లచ్చు నాయక్, జూలూరుపాడు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోదుగు రామకృష్ణ, కొలిపాక వెంకటేశ్వర్లు, మెంతుల కృష్ణ, తోట శ్రీను, మహిళా మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## టాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసిన సయామీ ఖేర్..!



కాస్టింగ్ కౌచ్ సినీ ఇండస్ట్రీలో గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. గతంలో పలువురు నటీమణులు తాము క్యాస్టింగ్ కౌచ్ బారినపడ్డామంటూ వెల్లడించిన విషయం తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ సైతం క్యాస్టింగ్ కౌచ్‌పై స్పందించింది. టాలీవుడ్‌లో తనకు ఎదురైన చేదు అనుభవం గురించి ప్రముఖ నటి సయామీ ఖేర్ కీలక విషయాలను బయటపెట్టింది. టాలీవుడ్‌కు చెందిన ఓ లేడి ఏజెంట్ అవకాశాల కోసం తనను 'సర్దుకుపోవాలి' అని చెప్పిందని తెలిపింది. తాను ఎలాంటి పనులకు దూరంగా ఉంటానని.. తనకు కొన్ని పరిమితులు ఉన్నాయంటూ తేల్చి చెప్పినట్లు చెప్పింది. సయామీ ఖేర్ 2015లో 'రేయ్' మూవీతో టాలీవుడ్‌కు పరిచయమైంది. ఆ తర్వాత 2016లో మిర్జియాతో బాలీవుడ్‌కు పరిచయమైంది. ఆ తర్వాత మౌళి, చోక్డ్, వైల్డ్‌డాగ్, ఘూమర్ చిత్రాలతో పాటు పలు వెబ్‌సిరీస్‌లలోనూ నటించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇండస్ట్రీలో తనకు వచ్చిన అవకాశాలతో సంతృప్తిగానే ఉన్నట్లు చెప్పింది. కెరియర్ ప్రారంభంలో జరిగిన ఘటన మాత్రం తనను తీవ్రంగానే బాధించిందని ఆవేదన వ్యక్తం చేసింది. కెరియర్ మొదట్లో ఓ తెలుగు సినిమా ఏజెంట్ తనను కలిశారని.. మూవీ ఛాన్స్‌ల కోసం కొన్ని విషయాల్లో సర్దుకుపోవాల్సి ఉంటుందని అన్నారని.. ఓ మహిళ అయి ఉండగా.. సాటి మహిళతో అలా మాట్లాడడం తనను షాక్‌కు గురి చేసిందని చెప్పింది. మొదట తాను మాత్రం ఆమె మాటలు అర్థం కానట్లుగా నటించానని.. తరచూ అదే విషయం చెబుతుండడంతో 'క్షమించండి. మీరు నన్ను ఆ మార్గంలో వెళ్లాలని సూచిస్తున్నారని అనుకుంటున్నాను. నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని నేను ఎప్పటికీ దాటను' అని తిరస్కరించినట్లు పేర్కొన్నారు. తన కెరియర్‌లో ఓ మహిళ నుంచే ఇలాంటి ప్రతిపాదన రావడం అదే తొలిసారి, చివరిసారి అని చెప్పింది. ఇదిలా ఉండగా.. సయామీ ఖేర్ చివరిసారిగా సన్నీ డియోల్ హీరోగా.. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చిన 'జాట్'మూవీలో నటించింది. ఈ మూవీలో ఎస్‌ఐ విజయలక్ష్మి పాత్రలో నటించి ప్రశంసలు పొందింది.


## మోదీ నెక్లెస్‌తో కేన్స్‌లో సందడి చేసిన బాలీవుడ్ భామ..





కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో అందాల ముద్దుగుమ్మలు వెరైటీ డ్రెస్సులలో కనిపిస్తూ తెగ సందడి చేస్తున్నారు. డిఫరెంట్ కాస్ట్యూమ్స్ ధరించి అందరి దృష్టిపై తమపై ఉండేలా చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ కి చెందిన నటి రుచి గుజ్జర్ మోదీ నెక్లెస్ ధరించి అందరి దృష్టి తనపై పడేలా చేసింది. కేన్స్ ఫెస్టివల్‌కి హాజరైన అందరికి స్పెషల్ డిన్నర్ ఏర్పాటు చేయగా, ఆ కార్యక్రమానికి రుచి గజ్జర్ లెహంగా వేసుకొని మెడలో మోదీ నెక్లెస్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. తన నెక్లెస్ కి బీజేపీ గుర్తు అయిన కమలం పువ్వులో మోదీ ఫొటోలు ఉన్న లాకెట్స్ తగించుకొని రుచి గజ్జర్ రావడం చర్చనీయాంశం అయింది. రుచి వేసుకొచ్చిన ఈ లెహంగా, నెక్లెస్‌లని రూప శర్మ డిజైన్ చేసినట్టు సమాచారం. ఈ మోదీ నెక్లెస్ గురించి రుచి గుజ్జర్ మాట్లాడుతూ.. ఈ డ్రెస్ మా రాజస్థానీ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వేసుకున్నాను. ఇక నెక్లెస్ విషయానికి వస్తే ఇది కేవలం జ్యువెలరీ కాదు. ధైర్యం, ముందు చూపు, భారత్ ప్రపంచ వేదికలపై ముందుకు వెళుతుందని గుర్తు. కేన్స్‌లో ఇలా వేసుకోవడం నా ప్రధాన మంత్రికి గౌరవం ఇవ్వడం కోసం. ఆయన నేతృత్వంలో ఇండియా కొత్త తీరాలకి వెళుతుంది అని పేర్కొంది. ఏది ఏమైన రుచి గజ్జర్ ఒక్క మోదీ నెక్లెస్‌తో కేన్స్‌లో ప్రకంపనలు పుట్టించింది అని చెప్పాలి. కేన్స్ ఫిలిం ఫెస్టివల్ అంటే ఫ్యాషన్ కి అడ్డా. అక్కడికి వచ్చే వాళ్లంతా కొత్త రకం డ్రెస్సులతో అలరిస్తారు. ఇక్కడ పలు సినిమాలు స్క్రీనింగ్ కూడా జరుపుకుంటాయి. ఇక రుచి గజ్జర్ విషయానికి వస్తే.. ఈమె రాజస్థాన్ కి చెందిన అమ్మాయి. జైపూర్ లో కాలేజీ పూర్తి చేసి ఆ తర్వాత మోడలింగ్ రంగంవైపుకు వెళ్ళింది. 2023లో మిస్ హర్యానా గా నిలిచిన ఈ అమ్మడు ఆ తర్వాత మోడలింగ్ చేస్తూ బాలీవుడ్ లో పలు ప్రైవేట్ వీడియో సాంగ్స్ చేసింది. అలా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని బాలీవుడ్‌లో చిన్న చిన్న పాత్రలు పోషిస్తుంది. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న ఈ భామ ఒక్కసారిగా మోదీ నెక్లెస్ తో అందరి కంట్లో పడింది. మరి ఇప్పటికైన రుచి గుజ్జర్ కి బాలీవుడ్ లో మంచి అవకాశాలు వస్తాయేమో చూడాలి.

## నేడు పాటల పూదోట వేటూరి సుందరరామ్మూర్తి వర్ధంతి



మంథని ): వేటూరి గా పిలవబడే వేటూరి సుందరరామ్మూర్తి 1936 న జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలో జన్మించాడు.. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తిచేశారు. ఆంధ్ర ప్రభ పత్రిక ఉప సంపాదకుడిగా 1956 నుంచి పదహారేళ్ళపాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. సుప్రసిద్ధ తెలుగు సినీ గీత రచయిత గా మరేముందు వేటూరి దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. తొలినాళ్ళలో పాత్రికేయునిగా పనిచేసిన వేటూరి కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఓ సీత కథ ద్వారా సినీ రంగ ప్రవేశం చేశారు. తర్వాత కొన్ని వేల పాటలను రాశారు. వేటూరి సుందరరామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. వేటూరి చాలా రకాల పాటలను రాసారు. సంప్రదాయ కవిత్వం దగ్గర నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. శ్రీశ్రీ తర్వాత తెలుగు సినిమా పాటకి జాతీయ ఉత్తమ సినిమా పాటల రచయిత పురస్కారాన్ని అందించారు. ఆయన మాతృదేవోభవ సినిమాకి రాసిన రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే... అనే పాటకి 1994వ సంవత్సరానికి గాను ఈ పురస్కారం వచ్చింది. ఇది తెలుగు పాటకు రెండవ జాతీయ పురస్కారం. అయితే కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి వేసిన మాతృ భాషాభిమానం ఈయన వ్యక్తిత్వ శైలికి ఒక మచ్చు తునక. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. ఆయన ఆఖరి సినిమా బద్రీనాథ్ లో ఓంకారేశ్వరి అనే పాటను అందించారు. 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు.




## ముంబైలో కమల్‌హాసన్, శింబు థగ్‌లైఫ్ టీం..



ఉలగనాయగన్ కమల్‌హాసన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం థగ్ లైఫ్ లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ చిత్రంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. యాక్షన్ డ్రామా ఎలిమెంట్స్, ఇంటెన్స్ ఎమోషన్స్‌తో సాగుతున్న ట్రైలర్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా మే 24న గ్రాండ్ మ్యూజికల్ కాన్సర్ట్‌లో ఆడియో ఆల్బమ్‌ను విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ఉలగనాయగన్ టీం ముంబైలో ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా దిగిన స్టిల్స్‌తోపాటు ప్రమోషనల్ ఈవెంట్స్ ఫొటోలు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. థగ్ లైఫ్ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని కమల్ హాసన్-ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్‌రెడ్ జియాంట్‌మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్ల పైకమల్ హాసన్-ఆర్‌మహేంద్రన్‌సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.


## కేన్స్‌లో తొలిసారి మెరిసి ప్రపంచాన్నంతా తనవైపుకి తిప్పుకున్న జాన్వీ కపూర్





ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చలనచిత్ర ఉత్సవాల్లో ఒకటైన కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో తొలిసారి సందడి చేసింది అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల కూతురు జాన్వీ కపూర్. గత వారం అట్టహాసంగా ప్రారంభమైన ఈ ఫెస్టివల్‌కి ప్రపంచంలో ఉన్న ఫేమస్ నటీనటులు అందరు హాజరై సందడి చేస్తూ ఉంటారు. హాలీవుడ్ నటీమణులు ఇప్పటికే కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కి హాజరై రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. అయితే తొలిసారి జాన్వీ కపూర్ కేన్స్ ఫిలింఫెస్టివల్‌కి హజరై ప్రపంచాన్నంతా తనవైపుకి తిప్పుకుంది. మంగళవారం జాన్వీ కపూర్ , ఇషన్ కట్టర్ జంటగా నటించిన 'హోమ్‌బౌండ్ సినిమా ప్రీమియర్ జరుపుకోగా, దాని కోసం జాన్వీ కేన్స్‌లో తొలిసారి అడుగు పెట్టింది. ప్రముఖ డిజైనర్ తరుణ్ తహిలియానీ రూపొందించిన మెటాలిక్ పింక్ కలర్ ప్రీ-డ్రేప్డ్ సారీతో జాన్వీ రెడ్ కార్పెట్‌పై నడిచి చూపరుల దృష్టిని తనవైపుకి తిప్పుకుంది. జాన్వీ కపూర్ ఫాలోయింగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో కేన్స్‌లోను అర్థమైంది. ఆమె కారు దిగిన మొదలు వేల కొద్ది కెమెరాలు ఆమె చుట్టూ తిరుగుతూ ఉన్నాయి.ఆమెని తమ కెమెరాలలో బంధించేందుకు ఫొటోగ్రాఫర్స్ పోటీ పడ్డారు. ప్రస్తుతం జాన్వీ కపూర్ క్యూట్ లుక్స్‌కి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరోవైపు జాన్వీ కపూర్ కూడా తన ఇన్‌స్టాలో కేన్స్ లుక్‌కి సంబంధించిన ఫొటో షూట్ చేసి ఆ పిక్స్ షేర్ చేసింది. ప్రస్తుతం అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. కాగా మరో నాలుగు రోజులు మే 24 వరకు ఈ కేన్స్ ఉత్సవం జరగనుంది.ఎంతో మంది అందాల భామలు కేన్స్‌లో సందడి చేయనున్నారు. కాగా, జాన్వీ కపూర్ దేవర సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్‌తో కలిసి పెద్ది అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా హిట్ అయితే జాన్వీ రాత మారినట్టే. తెలుగులో తొలిసారి చేసిన దేవర మంచి విజయం సాధించగా, ఇప్పుడు పెద్ది కూడా విజయం సాధిస్తే అమ్మడికి ఆఫర్ల వెల్లువ కురవడం ఖాయం అంటున్నారు.

## ధర్మం కోసం హరిహరవీరమల్లు యుద్ధం..




టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. హరిహరవీరమల్లు పార్ట్-1 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థర్డ్ సింగిల్ అసుర హననం లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఈ మూవీ నుంచి అసుర హననం లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు మేకర్స్. ఒక యోధుడు పైకి వస్తాడు. ఒక వారసత్వం ప్రారంభమవుతుంది. ధర్మం కోసం యుద్ధం ప్రారంభం కానుంది.. అంటూ విడుదల చేసిన ఈ పాట గూస్‌బంప్స్ తెప్పిస్తూ హరిహరవీరమల్లు పోరు ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తుంది. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.

Printed,PublishedandOwnedbyJADAVROHIDAS, PrintedatJADAVROHIDAS ,Associate printers,Padmanagar,Asifabad,Dist,Telangana-500001Publishedat,JANANINADAM,H..NO.12-27,Village;Fatkal , Mangi,Mandal;Lingapur,Dist:komaramBheem (Asifabad),State Telangana-505001,Editor:JADAV ROHIDAS RNI No.TELTEL/2023/12314,Cell:9550100197,9490111460.